# కర్నూలు | నంద్యాల వార్త

2 ఫిబ్రవరి 2023 గురువారం పేజీలు 4

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



శ్రీశైలంప్రాజెక్టు, ఫిబ్రవరి01, ప్రభాతవార్త
శ్రీశైలక్షేత్రంలో ఫిబ్రవరి 11 నుండి 21 వ తేది వరకు జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్న నేపథ్యాంలో ముఖ్యమంత్రి కార్యలయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కలిసి ఉత్సవాలకు ఆహ్వానించడం జరిగింది.కాగా ఉత్సవాలకు ముఖ్యమంత్రిని ఆహ్వానించే క్రమంలో ఏపి ఉపముఖ్యమంత్రి (దేవదాయశాఖ) కోటు సత్యనారాయణ,శ్రీశైలం నియేజకవర్గం ఏమ్మేల్యే శిల్పాచక్రపాణిరెడ్డి,దేవస్థానం ధర్మకర్తల మండలి ఆధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి,శ్రీశైలందేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండింతులు,అధ్యాపక,అర్చకస్వాములు కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రివర్యులకు వేద అశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలు, శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటం,దేవస్థానం క్యాలెండర్లు మరియు డైరిని అందజేయడం జరిగింది.

## నర్సింగ్ స్కూలుకు సెలవులు ఇచ్చిన ప్రిన్సిపాల్..!

- విద్యార్థినిలు ఆత్మహత్య చేసుకుంటారని.. సెలవులు ఇచ్చిన ప్రిన్సిపాల్
- వేధింపుల కారణంగా ఆత్మహత్యాయత్నాలకు పాల్పడిన విద్యార్థినిలు
- అపాలజీ లెటర్లు అడ్డుపెట్టుకొని వార్డెన్ బెదిరింపులు
- హాస్టల్లోకి ఔటర్స్..అందరూ వార్డెన్ బంధువులే..!?
- వార్డెన్ బయటకు రాకుండా వివాదం సరి చేస్తున్న ఆర్ఎఫ్‌టీసీ హెడ్




నర్సింగ్ స్కూల్లో చదువుతున్న విద్యార్థినులు ఆత్మహత్య చేసుకుంటారనే ఉద్దేశంతో స్కూల్‌కు సెలవులు ఇచ్చాడో పెద్దమనిషి.. ఆత్మహత్యలెందుకు చేసుకుంటారంటే వార్డెన్ ను చూసి భయపడుతున్నారంటాడు. అసలు ఆ వార్డెన్ ఏం చేసింది ఆమె అంటే ఎందుకు భయం అంటే తనకేం తెలియదు విచారిస్తున్నానంటాడు. విద్యార్థినులతో అపాలజీ లెటర్లు రాపించుకుని తల్లిదండ్రులకు చూపిస్తారని బెదిరిస్తుందా... అంటే తెలియదంటాడు. హాస్టల్లోకి వచ్చే బయటివ్యక్తులు ఎవరంటే వార్డెన్ బంధువులు అంటాడు. అసలు గొడవ ఏంటి అంటే తనకేం తెలియదు అంటాడు. మరి సెలవులు ఎందుకు ఇచ్చారు అంటే ఆత్మహత్య చేసుకుంటారని అంటాడు. వివాదానికి కారణం ఇది.. విషయం ఇది... అని స్పష్టంగా చెప్పకుండా పొంతన లేని సమాధానాలతో ఒక పెద్ద వివాదాన్ని కప్పిపుచ్చేందుకు కర్నూలు నగరంలోని (ఆర్ఎఫ్‌టీసీ)రీజినల్ ఫిమేల్ ట్రైనింగ్ సెంటర్ హెడ్ ప్రయత్నం చేస్తున్నాడు. విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు... నర్సింగ్ స్కూలుకు సెలవులు.... మీడియా కథనాలు నేపథ్యంలో విద్యార్థి సంఘ నేతలు మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్తే సదరు వార్డెన్‌ను ఎవరికంటా పడకుండా గదిలో ఉంచి తానే అందరికీ సమాధానం చెప్పాడు. అది కూడా తనకు తెలియదు తన దృష్టికి రాలేదు అనే సమాధానాలు తప్ప వివాదాలకు కారణమైన వార్డెన్‌ను మీడియా ముందుకు తెచ్చి సమాధానం చెప్పించలేదు. ఏది ఏమైనా ఆర్ఎఫ్‌టిసిలో పెద్ద స్థాయిలో భాగోతాలు నడుస్తున్నాయని అవి బయటపడితే పరువు పోతుందని అధికారుల ఉద్యోగాలకు ఎసరు వస్తుందని వివరాలను బయటకు రాకుండా చేస్తున్నారన్న చర్చ జరుగుతుంది. •వివరాలు 2లో

కర్నూలు, ప్రభాతవార్త :

## తొలి పూజ అందుకున్న.. సంఘమేశ్వరుడు..!

ప్రపంచంలోనే ఏడు నదులు కలిపే ఏకైక ప్రదేశం
కొన్ని నెలలే పూజలు అందుకునే ఆలయం



**కొత్తపల్లి ,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త:** సప్తనదుల్లో స్నానం ఆచరించి సంఘమేశ్వరుని దర్శనం చేసుకుంటే పాపాల నుంచి విముక్తి కలిగి మోక్షం లభించి నరలోక ప్రవేశం తప్పుందని భక్తుల నమ్మకం. అందు వల్లే ఈ ఆలయం ఏడాదిలో కొద్ది నెలలు మాత్రమే దర్శన భాగ్యం ఉండడంతో దర్శన కోసం భక్తులు ఎదురు చూస్తుంటారు. జూలై మూడవ వారంలో కృష్ణమ్మ పరవళ్ళతో ఆలయం ఆలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలో చేరుతుంది. సుమారు ఆరు నెలలు తర్వాత క్రమేపి నీటి నుండి బయటపడుతు భీష్మ ఏకాదశి రోజున ధర్మరాజు ప్రతిష్ఠించిన వేపదారు శివలింగం భక్తులకు దర్శనం ఇచ్చింది. బుధవారం భీష్మ ఏకాదశి సంధర్భంగా ఆలయ అర్చకులు తెలకపల్లి రఘురామశర్మ ఆలయం శుభ్రం చేసి శ్రీలలితా సంగమేశ్వరస్వామి , వినాయకుడు తదితర దేవతా మూర్తులకు తొలి పూజల చేశారు. సంఘమేశ్వరం వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆధ్యాత్మిక క్షేత్రం. ఎందరో ఋషులు తపస్సు చేసిన ప్రాంతం. ప్రపంచంలోనే ఏడు నదులు కలిపే ప్రదేశం ఇది. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని సంఘమేశ్వరంలో తుంగ, భద్ర,క్రిష్ణ, వేణి, భీమ మాలపహారణి, భనవాసి అనే ఏడు నదులు కలిపే అద్భుతమైన పుణ్యక్షేత్రం. పురాణాల ప్రకారం ప్రజలు పాపప్రక్షాళన కోసం ఇక్కడ భక్తులు స్నాం ఆచరిస్తారు. వారిని పునీతులుగా మారుస్తున్న గంగా నదికి ఓ కాకి తన రూపం పోవడానికి పుణ క్షేత్రాలు తిరుగుతు సప్తనదుల సంఘమేశ్వరంలో స్నానం ఆచరించగా కాకి రూపం పోయి తన అసలు రూపం వచ్చిందని కథనం పాప నివృత్తి అయినందననే ఈ ప్రాంతానికి సంఘమేశ్వరం అని పేరు. ఇలాంటి పుణ్యక్షేత్రం కొన్ని నెలలు మాత్రం పూజలు అందుకుంటుంది. ఆలయ సముదాయం క్రమంగా శిథిలమై పోయింది. ప్రస్తుతం కనిపిస్తున్న ఆలయం సుమారు 200 సంవత్సరాల క్రితం స్థానిక ప్రజలు నిర్మించారు. సుమారు ఇరవైవేల చదరపు అడుగుల



విస్తీర్ణంలో ఆలయంతో పాటు చుట్టూ ప్రకారం నిర్మించినట్లుగా శిథిలాలను చూస్తే తెలుస్తుంది. బుధవారం అత్యంత వైభవంగా స్వామివారు తొలి పూజలు అందుకున్నారు. శివుని వెనుక వైపున ఎడమ భాగంలో శ్రీలలితాదేవి, కుడివైపున వినాయకుడు దర్శనమిస్తారు. శ్రీశైలం ప్రాజెక్టు నీటిలో ఈ ఆలయం మునిగి పోవడంతో నిత్యం పూజలు జరగవు. గత వారం రోజులుగా నీటి మట్టం తగ్గుతు రావడం వలన స్వామి వారు నేడు భక్తులకు పూర్తిస్థాయిలో దర్శనం ఇవ్వడంతో ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



## ఆర్జేడి, డిఇఓ, ఎడి, హెచ్ఎంలపై.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు..!

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఇచ్చిన అదేశాల మేరకు

నంద్యాల విద్య, ఫిబ్రవరి 1, ప్రభాతవార్తః
రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన సంఘటన కర్నూలు ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకుంది. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అదేశాలు అమలుచేయకపోవడంతో కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడి) వెంకట కృష్ణారెడ్డి, కర్నూలు డిఇఒ వి రంగారెడ్డి, విద్యాశాఖ అసిస్టెంటు డైరెక్టర్లు శివప్రకాష్‌రెడ్డి, సామేల్‌పాల్, సూపరింటెండెంట్ క్లర్క్ రాజశేఖర్, కళాజ్యోతి, రెవనూరు హెచ్ఎం రామచంద్రారెడ్డిలపై రెవనూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి పిఒఎ యాక్టు 1989 సెక్షన్3 (జడ్‌సి) కింద కేసు నమోదుచేసినట్లు రెవనూరు పోలీస్‌స్టేషన్ ఇన్వెస్టిగేషన్ అధికారి ఎస్ మహమ్మద్ రిజ్వాన్ ఎఫ్ఐఆర్ నం.4/2023 తేది 31-01-2023 మేరకు జారీచేశారు. వీరంతా విద్యాశాఖకు చెందిన అధికారులుగా గుర్తించామన్నారు. వివరాల మేరకు నంద్యాల జిల్లా పరిధిలోని రెవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న కొప్పెర సతీష్‌కుమార్‌ను విచారణ



లేకుండానే సస్పెన్షన్ చేశారని కొందరు అడ్రస్ లేని వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేయకుండా చేసినట్లు చూపించి తప్పుడు రికార్డును సృష్టించి సమాచార హక్కు చట్టం దుర్వినియోగం చేశారని సాకు చూపుతూ సస్పెండ్ చేశారు. దీనిపై బాధితుడు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. చైర్మన్ తిరిగి అతన్ని పాత ప్లేస్‌లోనే నియమించాలని ఉత్తర్వులు ఇచ్చినప్పటికి ఆ ఉత్తర్వులు అమలుకు నోచుకోక హాలహర్వి మండలం కొక్కర్చేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో రాష్ట్ర ఎస్సీ చైర్మన్ వీరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదచేయాలని ఇచ్చిన అదేశాల మేరకు బాధితుడు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆళ్లగడ్డ డిఎస్పీ ఇచ్చిన అదేశాల మేరకు రెవనూరు పోలీస్‌స్టేషన్‌లో వీరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నిబంధనల మేరకు నమోదు చేశారు. బాధితుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ అఘమేఘాల మీద ఒకరోజు అడ్రస్‌లేని వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదేరోజే విచారణకు అదేశించి విచారణ చేయకున్నా చేసినట్లు తప్పుడు రికార్డు సృష్టించి అక్రమంగా సస్పెండ్ చేశారని తెలిపారు. ఇతని వెంట అడ్వకేట్ రాజేంద్రప్రసాద్‌లు ఉన్నారు.

## మున్సిపల్ కార్యాలంలో అంతా గోప్యమే..!

- ఎసిబి దాడులు...మీడియాకు అంక్షలు?
- ఓ ఉద్యోగి నిర్లక్ష్యం...రూ.10 కోట్ల బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

నంద్యాల, ఫిబ్రవరి 1, ప్రభాతవార్తః
నంద్యాల పురపాలక సంఘ కార్యాలయంలో రోజు రోజుకు పలు వింతలు, విశేషాలు చోటుచేసుకుంటు న్నాయి. గత అరునెలలుగా మున్సిపల్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు, టౌన్ ప్లానింగ్, రెవిన్యూ విభాగంలో జరుగుతన్న అవినీతిపై గత కొన్ని రోజులుగా వార్తపత్రికల్లోను, సోషల్ మీడియాల్లో కథనాలు వస్తు న్నాయి. ఈనెపథ్యంలో విజిలెన్స్‌దాడులు నిర్వహించిన కొద్దికాలానికే ఎసిబి దాడులు కూడ జరగడం విశేషం. ఎసిబి దాడులు జరిగిన మరుక్షణం కార్యాలయంలో పనిచేస్తున్న వారితో, సిబ్బందితో, అధికారులతో మీడియా ప్రతినిధులు ఏవరు మాట్లాడకూడదని ఓ




అధికారి అదేశాలు ఇచ్చారని దయచేసి మీడియా మిత్రులు మాతో కలువవద్దని కొందరు అధికారులు చేతు లేత్తి మీడియాకు చెప్పడం విశేషం. ఇక్కడ ప్రజాస్వామ్యం ఉందా అన్న ప్రశ్నలు పట్టణ ప్రజలకు సందేహాలు వెలిబుచ్చుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మున్సిపల్ కార్యాలయాల మూడు గేట్లకు తాళాలు వేశారు. ఒకే గేటు నుంచే రాకపోకలు జరగాలని అంక్షలు విధించారు. కార్యాలయంలో ప్రతి విభాగంలో జరుగుతున్న దోపిడీని అరికట్టెందుకు ప్రజలు ఎసిబికి సమాచారం అందిస్తే అందులో పనిచేసే సిబ్బందిపై అంక్షలు విధించడం ఏమిటని చర్చించుకుంటున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో ఓ ఉద్యోగి, కంప్యూటర్ అపరేటర్ దగ్గర కొంత సొమ్ము ఉన్నట్లు సమాచారం. ఎసిబి దాడులు తెలుసుకొని డబ్బుతో ఊడాయించారన్న అరోపణలు వెలువేత్తుతున్నాయి. ఇంత జరిగినా ఓ అధికారి నివాసం మాత్రం అనుమతులు లేని అపార్టుమెంట్‌లో ఎందుకుంటున్నారో అని కిందిస్థాయి సిబ్బంది చర్చించుకోవడం విశేషం. కాంట్రాక్టు సిబ్బంది కూడ అధికారుల ఇళ్ళల్లో సొంత పనులకు వినియో గించుకుంటున్నారని అరోపణలున్నాయి. మున్సిపాలిటిలో రెగ్యులర్, కాంట్రాక్టు సిబ్బంది వివరాలు బహిర్గతం చేయాలని ప్రజలు పేర్కొంటునా న్నరు. మున్సిపల్ కార్యాలయంలో గతంలో సుమారు 50 నుంచి 60 మంది కాంట్రాక్టర్లు ఉండేవారు. గత మూడు సంవత్స రాలుగా చేసిన పనులకు డబ్బులు రాకపోవడంతో మున్సిపాలిటి వైపు కన్నెత్తి చూడడం లేదు. పట్టణంలో 42 వార్డులో సుమారు రూ. 10 కోట్ల పనులు చేశారు. ఇంకా పెండింగ్‌లో రూ. 10 కోట్ల పనులు చేయాల్సి ఉందన్న సమాచారం ఉంది. కొత్త విధానంలో కాంట్రాక్ట ర్లకు సిఎఫ్ఎంఎస్ ద్వారా కాకుండా మరో రూపంలో నిధులు ఏర్పాటు చేయడంతో బిల్లులు కంప్యూటర్‌లో ఎక్కించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న అరోప ణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కాంట్రాక్టర్ల సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి జోక్యం చేసుకొని కాంట్రాక్టర్ల పరిస్థితికి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

## ఏసిబి వలలో పంచాయతీ కార్యదర్శి..



ఆదోని రూరల్,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త
ఏసిబి వలలో చిన్న పెండేకల్ పంచాయతీ కార్యదర్శి మల్లయ్య బుధవారం పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఏసిబి డిఎస్పీ శివనారాయణ స్వామి మాట్లాడుతూ మండల పరిధిలోని చిన్నపెండేకల్ గ్రామానికి చెందిన గురురాజా అనే వ్యక్తి వారసత్వపరమైన 3సెంట్ల స్థలం రిజిస్టర్ కోసం సర్టిఫికేట్ కోసం పంచాయతీ కార్యదర్శిని కోరగా దాని కోసం ఆ పంచాయతీ కార్యదర్శి మల్లయ్య రూ.8వేలు డిమాండ్ చేయగా రూ.4వేలు లంచానికి ఒప్పందం కుదుర్చుకుని తన సహాయకులైన షఫీకి లంచం ఇస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. షఫీ దగ్గర నుంచి ఆయన తీసుకుంటానని ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. దీంతో ఇద్దరిని ఎంపిడిఓ కార్యాలయంలో పట్టుకోవడం జరిగిందని ఏసిబి డిఎస్పీ తెలిపారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించండి

- జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి




నంద్యాల క్రైం, ఫిబ్రవరి 1, ప్రభాతవార్తః
పోలీస్ సిబ్బంది సమిష్టిగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సాయుధబలగాలు ఏర్పాటుచేసిన మొబిలైజేషన్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొనా న్నరు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడిన తరువాత మొదటిసారిగా ఈమొబిలైజేషన్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని సాయుధ పోలీస్ బలగాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తు జిల్లా పోలీస్‌శాఖకు మంచిపేరు తేవాలన్నారు. ప్రతియేటా మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించి సిబ్బందిలో నైపుణ్యం శారీర దృఢత్వం మెరుగుపరచడం అనవాయితీగా వస్తుందన్నారు. ఏఆర్ పోలీసుల దైనందిన విధులు సవాళ్ళతో కూడుకున్నవని ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి వీలు అవుతుందని ఎస్పీ తెలిపారు. అందులో భాగంగానే యోగా, ధ్యానం గురించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుంద న్నారు. సిబ్బందికి తమకు కేటాయించిన విధుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి పలు మెలకువలు సూచించారు. వివిధ విభాగాల్లో విధులను సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశా నిర్దేశం చేశారు. సిబ్బంది సంక్షేమంలో భాగంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని వారికేవైనా సమస్యలుంటే సంబంధిత అధికారులు పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఎఆర్ డిఎస్పీ సుకూరయ్య, దిశ డిఎస్పీ మారుతీరావు, ఆర్ఐ పోతల రాజు, ఆర్ఎస్ఐలు వీరన్న, సోమశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## శివ.. శివా.. ఈ శేషవస్త్రాల తికమక ఏంటి స్వామి..?

జూట్ బ్యాగుల మతాలాబ్ ముగిసినట్టేనా...?



శ్రీశైలంప్రాజెక్టు,ఫిబ్రవరి01, ప్రభాతవార్త
అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహ పుణ్యక్షేత్రంలో మల్లన్న చెంత శివ...శివా... ఈ శేషవస్త్రాల తికమక ఏంటి స్వామి...? అంతా సవ్యమేనా స్వామి నాణ్యత తిలోదాకాలకు ఏమైన రూపుదాల్చయా...? అంత అ నగరి మహిమేనా...? నూతన గుత్తేదారుని జూట్ బ్యాగుల మతాలాబ్ ముగిసినట్టేనా స్వామి...? ఇందులో నాణ్యత డొల్లతనమేనా...? ఇది కూడా అంత అ నగరి మహిమేనా...? జూట్ బ్యాగుల నాణ్యత లోపాలను,సరఫర అనుభవంను గుత్తేదారున్ని అదికారులు ప్రశ్నించడంతో పత్తాలేకుండా సర్దుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో ధర్మమెక్కడ ఉంది ఆధ్యక్షా...? పట్టుమని 10 నెలలు గడుస్తున్న క్రమంలోనే ఒకటి కాదు రెండు కాదు క్షేత్ర ఉద్యోగుల్లో ఆరోపణలు వేల్లువేత్తుతున్నాయి.సేవా బావం జాడే మచ్చుకైనా కానరావడంలేదన్న వదంతులు క్షేత్రంలో గుప్పుమంటున్నాయి.శాసనసభకు ఆధ్యక్షున్ని నేను నా మాటే శాసనం కావలన్నా తపన జరగాలంటవా స్వామి...? ఇది మల్లన్న క్షేత్రం తన దైన శైలిలో పాలన వ్యవహారాల్లో జోక్యం తగదు అంటారు ఉద్యోగులు.శాసన సభ ఆధ్యక్షుని మతలాబేంటి...? మల్లన్న చెంత సేవానిరతికి సాక్షాలేవి...? ఇది ధర్మమా,,, ఆ ధర్మమా,,,!! ధర్మకర్తలే దారి తప్పితే ఇది కూడా ఓ చోద్యమే కదా...? క్షేత్రంలో అవినీతి అంతా ఇంతా కాదు చాన్‌తాడంత ఉంది లోగ్గుట్లు వెలికితీస్తున్నామని ఓ మొస్తారులోనే దుమారం రేపటం శ్రీగిరిలో చర్చానీయాంశంగా మారింది.క్షేత్రంలో ఒక్క లడ్డూ తయారిలోనే లక్షలోనే గోల్‌మాల్ జరుగుతుందని బహిర్గతం చేయడం ఇంటి గుట్టు వీదికేకి క్కనంత పనైయిపోయింది కదా.మండలిలోనే బిన్నస్వరాలు ఒకరు అవినీతి అంటారు...?మరోకరు అవినీతి జరగలేదంటారు...? ఇలా ఇంటి కుంపటే ప్రకటనలు గుప్పించడం సరియైనదేనా...? ధర్మకర్తలందరు స్వామి పక్షమా...? సొంత పక్షామా...? అన్న సందేహలు క్షేత్రంలో వైరల్‌గా మారాయి.నిత్యం దేవస్థానంకు పెద్ద సంఖ్యాలో తరలివచ్చే భక్తుల మనోబావాలకు అభ్యంతర పరిచే వ్యాక్యలు సబబేనా అన్న ప్రశ్నలు క్షేత్రంలో ఉత్పన్నమౌవుతున్నాయి.ఈ నేపథ్యంలోనే దేవస్థానంలో అయా విభాగాల్లో తనిఖీల పేరుతో మండలి తీరు సిబ్బందిని ఇక్కట్లకు గురిచేస్తుండడం...? తాము చెప్పిన వారికి దేవస్థానం ఆయా విభాగాల్లో కాంట్రాక్టులు ఇవ్వమని నిర్ధేశించటం...? ఉద్యోగ ఉపాది అవకాశాల్లో తాము సూచించిన వారికే పట్టం కట్టాలని రెకమెండిషన్ చేయడం...? తదితర వంటి వాటిలో తాము చెప్పింది చేయాలని పట్టు పట్టడం....? వంటి కార్యకలపాలకు మొగ్గచూపుతున్నట్లు వ్యవహరించిన తీరుపై ఉద్యోగులే మల్లగుల్లాలు పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.అయ్యా,అమ్మవార్ల అగ్రహలకు అంతర్‌లీనం అంతు బట్టని చిక్కుముడిగా మారిందని మిమర్శలు వేల్లువెత్తుతున్నాయి.ఈక్రమంలోనే అతిది దేవోభవ గృహ సముదాయం ఓ టెండర్ విషయంలో రెకమెదేషనా...? స్వామివార్ల శేషవస్త్రల టెండర్‌పై రెకమెండెషనా...? భక్తులకు అభిషేకంకు అందజేసే జూట్ బ్యాగుల టెండర్‌పై రెకమెండేషనా...? ఇలా లోలోపల పావులు కదుపుతూ వ్యవహరించారన్న గుట్టు దేవస్థానం ఉద్యోగుల్లో చర్చానీయాంశంగా మారింది.స్వామివారి శేష వస్త్రాల సరఫర,జూట్ బ్యాగుల సరఫర నాణ్యతకు తూట్లు పొడిచే విధంగా ఉన్నా తమ మాటే సాగలన్నా ధోరణితో వ్యవహరించడం పలువురు ఉద్యోగుల్లో మింగుడు పడని వ్యవహరంలా లోలోపు సాగినట్లు పూకార్లు ఊపందుకున్నాయి.నీతి అనే ఉకదంపుడు ఉపన్యాసాలన్ని నీటిమీద రాతాలేనన్నట్లుగా ఇటివలికాలంలో వెలుగు చూసినవన్ని ప్రత్యక్ష సాక్ష్యలేగా అంటూ గుసగుసలు వినబడుచున్నాయి.శ్రీశైలం మల్లన్నస్వామి చెంత లోగుట్టు మతలాబులు ఇమడలేవంటారు భక్తులు.

# నర్సింగ్ స్కూలుకు సెలవులు ఇచ్చిన ప్రిన్సిపాల్..!

కర్నూలు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త : నర్సింగ్ స్కూల్లో చదువుతున్న విద్యార్థినులు ఆత్మహత్య చేసుకుంటారనే ఉద్దేశంతో స్కూల్‌కు సెలవులు ఇచ్చాడో పెద్దమనిషి.. ఆత్మహత్యలెందుకు చేసుకుంటారంటే వార్డెన్ ను చూసి భయపడుతున్నారంటాడు. అసలు ఆ వార్డెన్ ఏం చేసింది ఆమె అంటే ఎందుకు భయం అంటే తనకేం తెలియదు విచారిస్తున్నానంటాడు. విద్యార్థినులతో అపాలజీ లెటర్లు రాపించుకుని తల్లిదండ్రులకు చూపిస్తారని బెదిరిస్తుందా... అంటే తెలియదంటాడు. హాస్టల్లోకి వచ్చే బయటివ్యక్తులు ఎవరంటే వార్డెన్ బంధువులు అంటాడు. అసలు గొడవ ఏంటి అంటే తనకేం తెలియదు అంటాడు. మరి సెలవులు ఎందుకు ఇచ్చారు అంటే ఆత్మహత్య చేసుకుంటారని అంటాడు. వివాదానికి కారణం ఇది.. విషయం ఇది... అని స్పష్టంగా చెప్పకుండా పొంతన లేని సమాధానాలతో ఒక పెద్ద వివాదాన్ని కప్పిపుచ్చేందుకు కర్నూలు నగరంలోని (ఆర్ఎఫ్‌టీసీ)రీజినల్ ఫిమేల్ ట్రైనింగ్ సెంటర్ హెడ్ ప్రయత్నం చేస్తున్నాడు. విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు... నర్సింగ్ స్కూలుకు సెలవులు.... మీడియా కథనాలు నేపథ్యంలో విద్యార్థి సంఘ నేతలు మీడియా ప్రతినిధులు అక్కడికి వెళ్లే సదరు వార్డెన్‌ను ఎవరికంటా పడకుండా గదిలో ఉంచి తానే అందరికీ సమాధానం చెప్పాడు. అది కూడా తనకు తెలియదు తన దృష్టికి రాలేదు అనే సమాధానాలు తప్ప వివాదాలకు కారణమైన వార్డెన్‌ను మీడియా ముందుకు తెచ్చి సమాధానం చెప్పించలేదు. ఏది ఏమైనా ఆర్ఎఫ్‌టిసిలో పెద్ద స్థాయిలో భాగోతాలు నడుస్తున్నాయని అవి బయటపడితే పరువు పోతుందని అధికారుల ఉద్యోగాలకు ఎసరు వస్తుందని వివరాలను బయటకు రాకుండా చేస్తున్నారన్న చర్చ జరుగుతుంది.

కర్నూలు జిల్లా రీజినల్ ఫిమేల్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఏఎన్ఎం) శిక్షణ కేంద్రం ఉన్నది. అందులో 30 మందికి పైగా విద్యార్థినులు ఉన్నారు. అక్కడ ప్రిన్సిపల్ కమ్ వార్డెన్‌గా ఒక అధికారిని ఉన్నది. ఆమె ఎనిమిది నెలలుగా హాస్టల్లోని గదిలోనే నివాసం ఉంటూ 24 గంటలు విద్యార్థులను పర్యవేక్షిస్తున్నారు. అక్కడ ఏం జరుగుతుందో స్పష్టంగా బయటికి రాలేదు. కానీ ఇప్పటివరకు చాలామంది విద్యార్థులు తప్పులు చేశారని... ఎప్పటికప్పుడు వారి నుంచి మరోసారి ఇలాంటి తప్పులు చేయమంటూ అపాలజీ లెటర్లు రాయించుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులు బాయ్ ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్నారని, బయటకు వెళ్లి ఆలస్యంగా వస్తున్నారనే తరహా విషయాల్లో క్షమాపణ లేఖలు రాపించుకున్నట్లు తెలుస్తోంది. అయితే వార్డెన్ పని తీరుపై విద్యార్థినిలు కొందరు వ్యతిరేకమయ్యారు. వారిని భయపెట్టినట్లు తెలుస్తోంది. వారితో రాయించుకున్న లెటర్లు వారి తల్లిదండ్రులకు చూపిస్తానని వార్డెన్ బెదిరించినట్లు సమాచారం. దీంతో విద్యార్థినులు చాలామంది ఆమె చెప్పినట్లు భయంతో నడుచుకున్నారు. ఇద్దరు హాస్టల్ లోని ఫ్యాన్లకు ఉరేసుకున్నారు... తోటి విద్యార్థులు వారిని కాపాడటంతో గండం గడిచింది. వారు స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. అప్పుడు ఆర్ఎఫ్‌టిసి హెడ్ అక్కడికి వెళ్లి పరిస్థితి సర్దుమనిగించారు. ఆయన ఏం చెప్పారు... వార్డెన్ ఏం చెప్పారు తెలియదు కానీ, మరో విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. అంతటి వేధింపులతో విద్యార్థినులు ఒక్కసారిగా ఎదురు తిరిగారు. దీంతో ఆర్ఎఫ్‌టీసీ హెడ్ స్కూల్ కు సెలవులు ప్రకటించేశారు.

విద్యార్థులు వెళ్లిన తర్వాత చాలా విషయాలు బయటకు వచ్చాయి. సదరు ఆర్ఎఫ్‌టిసి శిక్షణ కేంద్రంలోకి బయటి వ్యక్తులు వచ్చేవారని మరి కొన్ని వివాదాలు ఉన్నాయని తెలిసింది. మొత్తం మీద ఈ విషయంపై ఆర్ఎఫ్‌టీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసయ్యను ప్రభాతవార్త వివరణ కోరింది. విద్యార్థినిలు ఆత్మహత్యాయత్నం చేసుకుంటారని భయంతో ఏఎన్ఎం శిక్షణ కేంద్రానికి సెలవులు ఇచ్చామన్నారు. ఎందుకు ఆత్మహత్య చేసుకుంటారు అనే ప్రశ్నకు అక్కడి ప్రిన్సిపల్ కమ్ వార్డెన్ చూసి భయపడుతున్నారన్నారు. భయపడాల్సిన పరిస్థితి ఏమిటి అంటే తనకి ఏమీ తెలియదు, విచారిస్తామన్నారు. వివాదం జరిగిన తర్వాత ఆమెను శిక్షణ కేంద్రంలో నివాసం ఉండవద్దని బయట ఉండి విధులకు హాజరుకావాలని ఆదేశించానన్నారు. అసలు ఆమె ఏం పొరపాట్లు చేసింది అంటే తనకి ఇంకా తెలియదన్నారు. బయటి వ్యక్తులు శిక్షణ కేంద్రంలోకి వస్తున్నారట కదా అన్న ప్రశ్నకు వారు వార్డెన్ బంధువులేనని చెప్పారు. ఇక వివాదానికి కారణమైన వార్డెన్ గదిలో నుంచి బయటికి రాలేదు, ఆమె ఆరోగ్యం బాగాలేదని ఆమె బయటకు రాలేదని అక్కడి వారు చెప్పారు. ఏది ఏమైనా ఇక్కడ ఇన్స్టిట్యూషన్ పరువును దృష్టిలో పెట్టుకొని అందరూ మాట్లాడుతున్నారే గాని జరిగిన తప్పిదాన్ని తీవ్రంగా పరిగణించకపోవడం గమనార్హం. ఇదే విషయంపై డిఎంహెచ్ఓ రామగిడ్డయ్య విచారణ చేశారు. ఆయన కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ వివాదంలో వార్డెన్‌కు అధికారుల సపోర్టు ఉందని ఆరోపణలున్నాయి. ఏది ఏమైనా ఈ విషయంపై మెడికల్ విభాగంతో కాక ఇతర ప్రభుత్వ విభాగాలకు చెందిన వారితో విచారణ చేయిస్తే అసలు నిజాలు బయటకు వస్తాయని... చదువుకునేందుకు వచ్చే విద్యార్థినిలకు రక్షణ దొరుకుతుందని... ప్రభుత్వ సంస్థలపై నమ్మకం ఏర్పడుతుందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి.

## దళితులపై దాడులు అధికం

**ఆస్పరి,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** కేంద్రం,రాష్ట్రంలో దళితులపై దాడులు అధికంగా పెరిగాయని వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విపలం చెందాయని దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాస్,జిల్లా కార్యదర్శి మహేష్‌లు మండిపడ్డారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో డిహెచ్‌పిఎస్ మండల కమిటీ సమావేశాన్ని జిల్లా సహాయ కార్యదర్శి ముద్దు రంగన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు దళితులపై దాడులు అధిక మవుతున్నాయన్నారు. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీలపై దాడులు జరుగుతున్నప్పటికీ అరికట్టడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ దాడులు అధికంగా జరుగుతున్నాయని,మన రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎస్‌సి,ఎస్‌టి,మైనార్టీలపై అగ్రవర్ణాలు దాడులు చేస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు ఓట్ల కోసమే దళితుల జపం చేస్తున్నారని,ఎస్‌సి,ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు ఇతర రంగాలకు దారిమళ్లిస్తూ దళితులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని,జగన్ ప్రభుత్వంలో ఎస్‌సి,ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధుల ఊసే లేదని,ఇంతకుముందున్న ప్రభుత్వాలు ఎస్‌సి,ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి దళితుల అభివృద్ధికి ఉపయోగించేవారన్నారు. రాష్ట్రంలో దళితవాడలలో మౌలిక వసతులు తాగునీరు,డ్రైనేజీ,సిసిరోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ నిధుల ద్వారా అభివృద్ధి చేయాల్సి ఉండగా నవరత్నాల పేరుతో ప్రభుత్వం వాడుకోవడం చాలా భాదాకరమన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా కృష్ణమూర్తి,అధ్యక్షులుగా రంగన్న,ఉపాధ్యక్షులుగా హెచ్ రంగన్న,రామన్న, కార్యదర్శిగా రామచంద్ర,సహాయ కార్యదర్శులుగా నల్లన్న,ఆవుని,కోశాధికారిగా పులికొండతో పాటు సమితి సభ్యులుగా 30మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సీనియర్ నాయకులు బ్రహ్మయ్య,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్,లక్ష్మన్న,నాగరాజు తదితరులున్నారు.

## ఉపాదికూలీల కడుపు కొట్టుతున్న కేంద్రము

**కోవెలకుంట్ల,పిబ్రవరి 1,ప్రభాతవార్త :** కేంద్రము అదికారములో ఉన్న బిజెపి ప్రభుత్వం బడ్జెట్‌లో ఉపాది పథకానికి నిదులు తగ్గించి కూలీల కడుపు కొట్టుతున్నదని సిపియం జిల్లా కార్యదర్శి సుదాకరు అరోపించారు. బుదవారము కోలకుంట్ల పట్టణంలో స్థానిక సిపియం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రములో అదికారములో ఉన్న బిజెపిప్రభుత్వం ఏటేటకు ఉపాది హామీ చట్టానికి బడ్జెట్‌లో కేటాయింపు తగ్గిస్తూ పేదల కడుపు కొడుతుందని చెప్పారు.గత సంవత్సరము బడ్జెట్‌లో 89వేల కోట్లుఉండగా 20213బడ్జెట్‌లో ఏకంగా దానిని రూ 60వేల కోట్లకు కుదించారని చెప్పారు.అలాగే అహర భద్రత కోసం గత సంవత్సరము బడ్జెట్ఓ రెండు లక్షల 27వేల కోట్లు ఉండగా ప్రస్తుతము దాఈనిని ఒకలక్ష97వేల కోట్లకుదగ్గించారని చెప్పారు.దీని బట్టి చూస్తే పేదలకు అన్యాయం చేసే బడ్జెట్ గా ఉందని అయన విమర్శించారు గత ఏనిమిది సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్లకు బహుళ జాతి కంపెనీలకు మతోన్మాద శక్తులకు ఏడిగలు చేయడము తప్ప కూలీల పట్లగాని రైతు పట్లగాని ఉద్యోగ ఉపాద్యాయుల విషయంలో గాని ఎటువంటి అలోచన చేకుండా ప్రజావ్యతిరేక విదానాలను అమలు చేస్తుందని అరోపించారు.

## వాల్మీకులు అన్నిరంగాల్లో రాణించాలి

**కర్నూలు రూరల్,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలని వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థాన చైర్మన్ బేతం కృష్ణుడు అన్నారు. బుధవారం బిర్లాగేట్ సమీపాన వాల్మీకి బోయ సేవా సంస్థ కార్యాలయంలో వాల్మీకి బోయ సేవా సంస్థ డైరీని రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెడ్ మహేష్‌కుమార్,ఎల్లమ్మ దేవస్థాన చైర్మన్ బేతం కృష్ణుడు,ఆ సంస్థ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. తలారి కృష్ణ నాయుడు,జిల్లా అధ్యక్షులు కుబేర స్వామిల ఆధ్వర్యంలో ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ రామచంద్రుడు ఎండి,రిటైర్డ్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జి భవాని ప్రసాద్,సాంబశివ అసిస్టెంట్ లేబర్ కమీషనర్ సత్రం రామకృష్ణుడు కర్నూలు టిడిపి బిసి సెల్ అధ్యక్షులు డైరీ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లావ్యాప్తంగా వచ్చిన వాల్మీకి సోదరులు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా బేతం కృష్ణుడు మాట్లాడుతూ వాల్మీకులందరు ఈరోజున సమావేశమై ఈ డైరీని ఆవిష్కరించడం ఎంతో శుభపరిణామమన్నారు. అలాగే వాల్మీకుల చరిత్ర ఎంతో ఘనమైనది వాల్మీకి మహర్షి మన జాతి వాడని మనందరం గర్వపడాలన్నారు. వాల్మీకులు విడిపోకుండ అందరు ఏకమై ఏ పార్టీలో ఉన్నా,ఏ వృత్తిలో ఉన్నా వాల్మీకులు రాజకీయంగా,ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలన్నారు. భవిష్యత్తులో ఈ వాల్మీకి బోయ సేవా సంస్థను మరింతగా విస్తరింపచేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన వాల్మీకి నాయకులు,గార్గేయపురం వైసిపి నాయకులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
### - రెవిన్యూ అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశం

**సు ంకేశ్వరి(మంత్రాలయం),ఫిబ్రవరి 1,ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రెవిన్యూ అధికారులను అదేశించారు.బుధవారం మండల పరిధిలోని సు ంకేశ్వరి గ్రామానికి చెందిన మహిళా రైతు కురువ ఉరుకుందమ్మ స.నం 297లో తనకున్న వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలని అధికారులకు ధరఖాస్తు చేసుకుంది.ఇందులో భాగంగా సదరు మహిళా రైతు భూమిని సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు.భూమి వివరాలను స్థానిక తహశీల్దార్ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల విఆర్ఓలు తమ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు.ముఖ్యంగా ఆన్‌లైన్ అడంగల్ సమస్యలు,వన్ బి,ఈ-పాస్‌బుక్కుల సమస్యలు లేకుండా చూసుకోవాలని కోరారు.వీరివెంట మండల సర్వేయర్ వాహిద్,ఆర్ఐ ఆనంద్ తదితరులు ఉన్నారు.

## పార్టీలో ఉండేది ఎవరో..ఊడేదెవరో..!

**మద్దికెర,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** మద్దికెర మండలంలో ప్రధానంగా వైసిపి-టిడిపి మధ్య హోరాహోరీ నడిచేది. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసిపిలో,టిడిపిలో వర్గపోరు ఇప్పటివరకు నడిచినా ఇక ముందు నడవదు అని పార్టీ ప్రధాన నాయకులు చెప్పుకొస్తున్నారు. వైసిపికి మండలంలో గుర్తింపు తెచ్చిన ఒక బలమైన నాయకుడిని పార్టీకి కనుమరుగయ్యేలా చేశారు. ఈ మధ్యకాలంలోనే ఒక పదవికి రాజీనామా చేయగా మరికొన్ని రోజుల్లోనే పార్టీకి కూడా గుడ్‌బై చెబుతారని వారి అనుచరులు అంటున్నారు. వైసిపిలో ఉన్న వారు ఊడిపోవడమే కాక వర్గపోరు కూడా నడుస్తుందని తెదేపా వారి వాదన. ప్రతి మండలానికి ఒక కింగ్‌మేకర్ ఉన్నట్లుగానే మద్దికెరకు కింగ్‌మేకర్ ఉన్నాడు. ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ అధికారంలోకి వస్తాదని ప్రజల యొక్క నమ్మకం. ప్రస్తుతం ఆయన వైసిపికి మద్దతు తెలపడంతో మండలంలో అధిక సీట్లు వైసిపికి రావడం జరిగిందని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఒకే సామాజిక వర్గం వారికి పార్టీలో ప్రాధాన్యత ఇవ్వడంతో మరో వర్గం వారు వారి పనులు వారు చేసుకుంటూ వెళ్లిపోతున్నారని వైసిపి కార్యకర్తలలో చర్చ. మరి తెదేపా పార్టీ సంగతికి వచ్చేసరికి ఇప్పటివరకు వర్గపోరు ఉన్నా లేనట్లుగానే నటిస్తున్నారని వైసిపి వారి వాదన. తెదేపా అధిష్టానం పదేపదే కలిసి పనిచేయండని చెప్పినప్పటికీ ఎవరి కార్యక్రమాలు వారు నిర్వహిస్తూ వస్తున్నారని పార్టీ కార్యకర్తలు అంటున్నారు. తెదేపాలో వర్గపోరు లేకుంటే 2024లో కంచుకోట పసుపుజెండాలతో కళకళలాడుతాదని ప్రజలంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే మళ్లీ ఫ్యాన్‌ను గరగర తిప్పుతాయని వైసిపి కార్యకర్తల మాట ఏదిఏమైనప్పటికీ వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల లోపు మండలంలో వైసిపి తెదేపా పార్టీలో ఉండేదెవరో..ఊడేదెవరో..కచ్చితంగా చెప్పలేకపోతున్నాం అంటున్నారు కింది స్థాయి పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు.

## 4వ తేదిన వాహనాల వేలం

**కోవెలకుంట్ల,పిబ్రవరి 1,ప్రభాతవార్త :** కోవెలకుంట్ల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ భ్యూరో పరిదిలో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 4వ తేదిన వేలం నిర్వహిస్తున్నట్లు సిఐ పి.శ్రీనివాసులు చెప్పారు. ఈ వేలం ఎన్ఫోర్స్మెంటు సూపడెంటు అదేశాల మేరకు వారి అద్వర్యంలో నిర్వహించడము జరుగు తుందని చెప్పారు. వేలంలో పాల్గొనే వారు తమ అదారు కార్డు మరియు రూ 3000 డిపాజిట్, చెల్లించి వేలంలో పాల్గొన్నాలని చెప్పారు. వేలంలో దక్కించుకున్న వాహనానికి అక్కడే రుసము చెల్లించి వాహనాలన్ని స్వాదీనము చేసుకోవాలని చెప్పారు.ఈ 4వ తేదిన ఉదయంయ 9.230నిమిషాలకు నిర్వహించడము జరుగుతుందని చెప్పారు.మిగతా వివరాలకు స్థానిక సిఐ శ్రీనివాసులను సంప్రదించాలని చెప్పారు.

## వెల్దుర్తిలో ఘునంగా భీష్మ ఏకాదశి వేడుకలు

**వెల్దుర్తి,ఫిబ్రవరి1,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలో బుధవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భీష్మఏకాదశి వేడుకలు నిర్వహించారు.ముందుగా వారు పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ చేపట్టారు.అనంతరం గంగమ్మ ఆలయం నుంచి భీష్ముని చిత్రపటాన్ని రథంపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు.ఆ ఊరేగి ంపు తిరిగి గంగమ్మ ఆలయానికి చేరుకుంది.అక్కడ ప్రత్యేక పూజలు చేశారు.భక్తులకు అన్నదానం,తీర్థప్రసాదాలు అందించారు. గంగపుత్ర సంఘం నాయకులు కోదండరాముడు,చిన్నకోదండ, నత్తియల్లక్రిష్ణ,యల్లకేశవులు, నాగశే షులు, శ్రీనివా సులు,రమేష్,లక్ష్మీనారాయణ,టివిఎస్.బాలు,ఏసిఎం.కిట్టు,బాలాజి,శంకర్,శేఖర్,హరి,ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మడివాళ మాచిదేవ జయంతి

**హొళగుంద,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన హొళగుందలోని రజక సంఘం ఆద్వర్యంలో శ్రీ మడివాల మాచిదేవ జయంతి కార్యక్రమం,నూతన 2023క్యాలెండర్ ఆవిష్కరణ రజక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం రజకుల కులదైవమైన మడివాల మాచిదేవ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ పురాణాలు మడేలయ్య తన యొక్క పాపపరిహారం తీర్చుకోవడానికి సుపముప్పది మూడు కోట్ల దేవతలు, మునులు విడిచిన వస్త్రాలను 12స॥లు శుద్ధి చేస్తాడన్నారు. ఒకరోజు శివుడు మడేలయ్య వృత్తిని పరీక్షించేందుకు తన పులి చర్మంతో పాటు తాను కప్పుకునే బొంతను పిండమని కోరుతాడని ఆ బొంత 33గజాల పొడవుతో అందులో చీరపేన్లు,నల్లులు,101జంతువులు ఉన్నాయని వాటిని చావకుండ పిండటం నీ తరం కాదని చెప్తాడు అయినప్పటికీ మడేలయ్య పిండుతానని బయలుదేరుతాడు. అప్పుడు మడేలయ్య ఏనుగు మీద బొంతను వేసుకుని నీటి కోసం లోకాలన్నీ తిరిగినా కనిపించవు ఎందుకంటే అప్పటికే పరమశివుడు నీటిని మాయం చేస్తాడని అప్పుడు మడేలయ్య భార్య శీతలాదేవి పరమశివుడు పెట్టిన పరీక్షను ఎలాగైనా నెగ్గాలని మన వృత్తి ధర్మాన్ని పాటించాలని మడేలయ్యతో నన్ను సంహరించి నా అవయవాలతో బొంతను పిండి పరమశివుని కోరిక తీర్చాలని కోరుతుందన్నారు. అప్పుడు మడేలయ్య శీతలాదేవి అవయవాలతో బొంతను పిండుతాడన్నారు. అప్పుడే శీతలాదేవి పేగులను తీసి చెరువు మీద వేయగా తూటికూరగా మొలుస్తాయని రజకులు ఇప్పటికీ తూటికూర తినకపోవడానికి ఇదే కారణంగా చెబుతారన్నారు. బొంత పిండిన తర్వాత శివుని కొరకు వెతుకుతుండగా కనిపించడని దారిలో ఒక కుష్టువ్యాధిగ్రస్తుడు మడేలయ్యను ఎవరి కోసం వెతుకుతున్నావని అడుగుతాడని అతను శివుని గురించి చెప్పగా అయితే నన్ను నీ భుజాల మీద ఎక్కించుకుని తీసుకుపోతే నేను శివున్ని చూపిస్తానని అనడంతో అలా అతన్ని భుజాల మీద ఎక్కించుకుని వెళ్తుండగా ఉన్నట్టుండి అతను బరువు పెరిగిపోతాడు. అప్పుడు మడేలయ్య అతని బరువు మోయలేక కిందదించుతాడు వెంటనే అతను మాయమైపోతాడు అంతలో ఎదురుగా వస్తున్న వ్యక్తి మడేలయ్యతో నువ్వు నీ భార్య వెళ్లారు వచ్చేటప్పుడు నీ ఒక్కడివే వస్తున్నావేంటని అడుగగా అప్పుడు మడేలయ్య జరిగిన విషయం మొత్తం చెప్పుండగా అతను ఒక్కసారి వెనక్కి తిరిగి చూడమంటాడు అతను వెనక్కి తిరిగి చూడగానే శీతలాదేవి కనిపిస్తుంది. ఆ వ్యక్తియే శివుని రూపంలో ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమంటాడన్నారు. అప్పుడు మడేలయ్య నాకు చాకలి వృత్తి కావాలని కోరుకుంటాడన్నారు. అంతకుముందు మడివాల మాచిదేవ చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మంగయ్య,లక్ష్మన్న ఎల్ఐసి,నాగరాజు,బసవరాజు,మల్లికార్జున, కరెంటు మల్లికార్జున,రవి రాజశేఖర్,లక్ష్మన్న,మల్లి తదితరులున్నారు.

## ధర్నాను జయప్రదం చేయండి

**కర్నూలు మున్సిపల్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్తః** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఫిబ్రవరి 6వ తేదిన కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో ప్రజలు, టిడ్కో గృహాల లబ్దిదారులు, జగనన్న కాలనీ లబ్దిదారులు,సిపిఐ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కాం ప్రేడ్ బి గిడ్డయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయం నందు జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన నవరత్నాలలో భాగంగా రాష్ట్రంలోని అందరికి ఇళ్ల పేరుతో నిర్మాణం చేపడతామని చెప్పడం జరిగిందని 2019 జూలై 1న రాష్ట్రవ్యాప్తంగా 9024 జగనన్న కాలనీలు నాలుగేళ్లలో 27 లక్షల ఇళ్ళ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికి మొదటి విడత 2019 ఆగష్టు 26 నాటికి 15 లక్షల ఇళ్ల పూర్తిచేయాలన్న లక్ష్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం టిడ్కో గృహాలను లబ్దిదారులకు అప్పజెప్పాలని సిపిఐ పోరుబాటలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ, టిడ్కో గృహాల లబ్దిదారులను కలువడం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోవడంతో ఫిబ్రవరి 6న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయం ముందు అందోళనకు రాష్ట్ర సమితి పిలుపునివ్వడం జరిగిందని అందులోభాగంగానే కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో జగనన్న లబ్దిదారులు, సిపిఐ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్ రసూల్, ఎస్ మునెప్ప, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

## నేడు మహానంది క్షేత్రంలో వేలాలు

**మహానంది, ఫిబ్రవరి 1, ప్రభాతవార్తః** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో టెండర్లను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఒకసంవత్సర కాలపరిమితికి గాను ఉభయ టోల్‌గేట్లు, పాదరక్షలు, టాయిలెట్స్, వివిధ రకాలకు సంబంధించిన వేలాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాటదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## రాయలసీమ యూనివర్శిటి రెక్టార్‌గా ప్రొఫెసర్ సి.వి.కృష్ణారెడ్డి

**కర్నూలు విద్య, ఫిబ్రవరి 1, ప్రభాతవార్తః**

రాయలసీమ యూనివర్శిటి రెక్టార్‌గా ప్రొఫెసర్ సి.వి.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ సుందరంద్ పుచ్చ, కళాశాల అభివృద్ధి మండలి డీన్‌గా ప్రొఫెసర్ ఎం ఇ రాణి వర్శిటిలో బాధ్యతలు తీసుకున్నారు. అమరావతిలో జరిగిన కార్యవర్గ సమావేశంలో వర్శిటి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనందరావు, ఇసి సభ్యులు నిర్ణయం ప్రకారం నూతన అధికారుల పరిపాలన భవనంలో బాధ్యతలు తీసుకు న్నారు. ఆచార్య కృష్ణారెడ్డి ఫిజిక్స్ హెడ్‌గా, ప్రిన్సిపాల్‌గా ఇసి మెంబర్‌గా ఉన్నారు. ఆచార్య సుందరంద్ ఇప్ప టికే రిజిస్ట్రార్‌గా, మ్యాథమెటిక్స్ హెడ్‌గా, డీన్‌గా పనిచేశారు. ఆచార్య ఎంఇ రాణి రసాయనశాస్త్ర హెడ్ గా, చైర్మన్ బోర్డు అఫ్ స్టడిస్‌గా, డైరెక్టరేట్ అఫ్ అడ్మిషన్ డైరెక్టర్, మహిళా రక్షణ సెల్ చైర్మన్‌గా పనిచేశారు. వర్శిటిలలో వీసి అదేశాల మేరకు బాధ్యతలు నిర్వహిస్తామని, రాయలసీమ యూనివర్శిటి అభివృద్ధి కొరకు అందరు కలిసి పనిచేయాలని తెలిపారు. నూతన అధికారులకు వర్శిటి అధ్యాపకులు ప్రొఫెసర్ మధుసూదన వర్మ, అసిస్టెంటు ప్రొఫెసర్ కాంట్రాక్ట్, నాన్ టీచింగ్ రెగ్యులర్,టైమ్ స్కేల్ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## పాతపెన్షన్ ఇస్తావా...గద్దె దిగిపోతావా...

**-ఈనెల 3న సంకల్పదీక్షను జయప్రదం చేయండి : యూటిఎఫ్**

**నంద్యాల విద్య, ఫిబ్రవరి 1, ప్రభాతవార్తః** ఉపాధ్యాయులు జీవిత భద్రతకు ముప్పుగా పరిగణిస్తున్నన సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానాన్ని అమలుచేయాలని యూటిఎఫ్ జిల్లా నాయకులు ప్రసాద్, సుధాకర్, జాకీర్ హుశేన్‌లు పేర్కొన్నారు.బుధవారం యూటిఎఫ్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ప్రతిసభలోను సిపిఎస్‌ను వారంలో రద్దుచేస్తానని చెప్పిన మాట ఏమైందంటూ ప్రశ్నించారు. సుమారు నాలుగు సంవత్సరాలు కావాస్తున్నా సిపిఎస్ రద్దు అంశం తేలకపోవడం విశేషమన్నారు. పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, చత్తీష్‌ఘడ్, జార్ఖడ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఇటీవలే పాత పెన్షన్ విధానం పునఃరుద్ధరించ్చాయని పేర్కొన్నారు. మాట తప్పం, మడమ తిప్పం అన్నమాట ఏమైందంటూ వారు అందోళన వ్యక్తం చేశారు. పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రం కూడ 2023 ఏప్రిల్ నుండి పాత పెన్షన్ విధానం అమలుచేస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయని ఈనేపథ్యంలో గ్యారంటి పెన్షన్ స్కీం అలోచన విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ఈనెల 3వ తేదిన కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలో ధర్మస్థలి ప్రాంగణంలో సంకల్పదీక్ష సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసభకు అధికార పార్టీ మంత్రులను కూడ అహ్వానించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున సభకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో శాంతిప్రియ, రాంమోహన్, సత్యప్రకాష్, బాబా ఫకృద్దిన్, రామకృష్ణుడు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారులకు సిబ్బంది సత్కారం

**బనగానపల్లె,ఫిబ్రవరి1,ప్రభాతవార్త:** బనగానపల్లె మండలం ఎంపిడివో మరియు గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఏ.శివరామయ్య,గ్రామ పంచాయతీ ఈవో ఖలీల్‌ను సిబ్బంది బుధవారం సత్కరించారు.వారిద్దరు ఉత్తమ సేవలతో గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ సేవా పురస్కారాలను ఉన్నతాధికారుల చేతుల మీదుగా పొందారు.ఎంపిడివో శివరామయ్య పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా కొద్ది సంవత్సరాలుగా ఉత్తమ సేవలు అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.అలాగే ఎంపిడివో సూచనలు,సలహాలు పాటించడం వల్ల ఖలీల్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించారు.వారి సేవలను గుర్తించిన జిల్లా కలెక్టర్ గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ సేవ పురస్కారాలతో వారిని సత్కరించారు.బనగానపల్లె గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు ఎంపిడివో కార్యాలయ సిబ్బంది ఈ ఇద్దరు అధికారులను మండలస్థాయిలో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో కార్యాలయ ఏవో నాగరాజు,సీనియర్ అసిస్టెంట్ కాశీనాథ్,జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి,కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మిరెడ్డి,పంచాయతీ కార్యదర్శులు శివశంకర్‌నాయక్,రామేశ్వర్,గురుప్రసాద్ ,శ్రీనివాసులు,ప్రకాశం,గోవర్ధన్, లక్ష్మినారాయణ, మహేష్,సుభాషిణి,స్వర్ణలత,సునీత,సుబ్బమ్మ,శకుంతల,వేదావతి,మనోహర్,లిఖిత,మనోజ్,భార్గవి,సువర్ణ,శ్రీప్రవల్లిక,చంద్రశేఖర్,సుబ్బయ్య,మంజునాథ్,ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

## 3న వాహనాల వేలం పాటలు

**ఆదోనిటౌన్, ఫిబ్రవరి01, ప్రభాతవార్త ;** ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో సీజ్ అయిన వాహనాలకు ఈనెల 3వ తేదీన వేలం పాటలను నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ హరిక్రిష్ణ బుధవారం తెలిపారు. ఈ వేలం పాటల్లో కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్లు ఉన్నాయని, ఆసక్తి గల వారు ఈనెల 3వ తేదీన ఉదయమే స్టేషన్‌కి వచ్చి రూ.5 వేలు దారావత్తు మొత్తం చెల్లించి పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు స్థానిక సెబ్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

## వలసలు వెళ్లొద్దంటారు...చేసిన పనులకు డబ్బులు మాత్రం చెల్లంచరు

**- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కూలీల ఆందోళన**

**కౌతాళం, ఫిబ్రవరి01, ప్రభాతవార్త ;** బతకడానికి వలసలు వెళ్లొద్దంటారు...చేసిన పనులకు డబ్బులు మాత్రం చెల్లంచరని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కౌతాళం మండలకేంద్రంలోని జాతీయ ఉపాధిహామీ పథకం కింద పనిచేసిన కూలీ యొక్క వేతనాలు చెల్లించలేదంటూ మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఉపాధి కూలీలు ముట్టడించారు. గ్రామ ప్రజలు ఉపాధిహామీ పనులు చేసిన 8 వారాల వేతనాలు చెల్లించలేదంటూ వాపోయారు. పెండింగ్ ఎనిమిది వారాల వేతనాలపై ఆగ్రహించిన సీపీఎం మండల కార్యదర్శి ఈరన్న, సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన పనులకు ఎందుకు కూలీ డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తుందని ప్రశ్నించారు. త్వరితగతిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. స్పందించిన ఏపీఓ జుబేర్ మాట్లాడుతూ ఉపాధిహామీ యొక్క వేతనాలను త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఉపాధి కూలీలు ఆందోళన విరమించారు.

## రెండో రోజూ కొనసాగిన ఉరుకుంద ఈరన్నస్వామి వారి హుండీ లెక్కింపు

**కౌతాళం, ఫిబ్రవరి01,, ప్రభాతవార్త ;** మండలంలోని ఉరుకుంద గ్రామంలో ఆలయ ఈఓ వాణి ఆధ్వర్యంలో రెండో రోజూ బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని కొనసాగించారు. ఇందులో నగదు రూ. 39,58,672, బంగారం 001 గ్రాముల 500 మి.గ్రా. సిల్వర్ 4 కేజీల 900 గ్రాములు వచ్చిందన్నారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వినియోగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ ఆర్.నాగరాజుగౌడ్, పాలకమండలి సభ్యులు ఆర .విజయేంద్రరెడ్డి, బి.నరసింహులు, రెడ్డిగీత, నరసమ్మ, ఆర్.రమణి, ఆదోని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, దేవస్థాన సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మడివాల మాచిదేవ జయంతోత్సవం

**కౌతాళం, ఫిబ్రవరి01, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన కౌతాళంలో రజకుల కుల గురు అయినటువంటి శ్రీ వీరభద్ర స్వరూపి మడివాల మాచిదేవ దేవస్థానంలో స్వామివారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని 21 కలశాలతో మంగళవాయిధ్యాలతో స్వామివారి భజన కీర్తనలు పాడుతూ గ్రామ పురవీదుల్లో ఊరేగించారు. అనంతరం విచ్చేసిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు పక్కీరప్ప, నరసింహులు, గిరియప్ప, లింగన్న, లింగాలదిన్నె నరేష్, నరేంద్ర, సుధాకర్, నాగరాజు, భక్తాదులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీజనల్ హాస్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**కౌతాళం, ఫిబ్రవరి01, ప్రభాతవార్త ;** కౌతాళం గ్రామంలోని ప్రాథమిక కన్నడ పాఠశాలలో స్త్రీ శక్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏపీఎం రాజశేఖర్ సీజనల్ హాస్టల్ అనే కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో వలసలువెళ్లిన తల్లిదండ్రుల పిల్లలకు వసతిగృహం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు దేశాయ్ ప్రహ్లాద్ ఆచారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయురాలు త్రివేణి, గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్, గురుగౌడ్, ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సత్యప్పస్వామి, చౌదరిబసవ, మాజీ సర్పంచ్ అవతారం, హైస్కూల్ చైర్మన్ వడ్డే రామన్న, ఉమాపతి సమ్మద్, వెంకోబ, ఈరన్న, రాజమహ్మద్, వార్డుమెంబర్ రామకృష్ణ, ఖాసీం, బాషా, వీరేష , మెహిద్దీన్, ఉపేంద్ర, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మామిడిలో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన సదస్సు

**గడివేముల, ఫిబ్రవరి01, ప్రభాతవార్త ;** మండలంలోని గని ఎల్‌కేతండా గ్రామాల్లో రైతులకు మామిడి పూత, పిందె దశలో ఉన్నందున తక్షణం చేపట్టవలసిన సస్యరక్షణ మరియు యాజమాన్య పద్ధతులపై బుధవారం నాడు హెచ్‌ఆర్‌ఎస్ సైంటిస్ట్ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉద్యాన అధికారి వి.నాగరాజు, నాబార్డు అధికారి హబీబ్, మండల వ్యవసాయ అధికారి హేమసుందర్‌రెడ్డిలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానశాఖ ద్వారా అమలుపరుస్తున్న పథకాలైన కలెక్షన్ సెంటర్, కోల్డ్ రూమ్, కొబ్బరి విస్తరణ పథకం, ఉద్యాన పంటల విస్తరణ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మామిడి, చీని తోటలను పరిశీలించి చీడపీడల నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గని గ్రామ సర్పంచ్ ఆనందరెడ్డి, గని ప్రతాప్‌రెడ్డి, పాణ్యం ఉద్యాన అధికారి దివ్య, పెసరవాయి వీహెచ్‌ఏ నాగార్జునరెడ్డి, గని వీఏఏ జయశ్రీ, మంచాలకట్ట వీఏఏ సునీల్‌కుమార్, గని ఎల్‌కేతండా గ్రామ రైతులు పాల్గొన్నారు.

## డ్రెయినేజీ పనులు ప్రారంభం

**కౌతాళం, ఫిబ్రవరి01, ప్రభాతవార్త ;** మండలకేంద్రమైన కౌతాళంలోని ఎన్‌టీఆర్ నగర్ కాలనీలో ఐదు రహదారుల డ్రెయినేజీ పనులను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో వైసీపీ నాయకులు దేశాయ్ ప్రహ్లాద ఆచారి ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. వైఎస్సార్సీపీ మండల నాయకులు దేశాయ్ ప్రహ్లాద ఆచారి మాట్లాడుతూ ఈ ఐదు డ్రెయినేజీ పనులను చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అతి త్వరలోనే సీసీ రోడ్లు కూడా వేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సత్యప్పస్వామి, మాజీ సర్పంచ్ అవతారం, ఎహస్కూల్ చైర్మన్ వడ్డే రామన్న, మాజీ ఉప సర్పంచ్ ఉమాపతి, సమ్మద్, వెంకోబా, ఈరన్న, రాజమహ్మద్, వార్డు మెంబర్ రామక్రిష్ణ, బాషా, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోషకాలున్న చిరుధాన్యాలపై ప్రజలు మక్కువ

**-చిరుధాన్యాల ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించండి : జిల్లా కలెక్టరు**

**నంద్యాల, ఫిబ్రవరి 1, ప్రభాతవార్తః** పోషక విలువలు అధికంగా ఉన్న చిరుధాన్యాల పంట ఉత్పత్తులపై రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టరు డా.మనజిర్ జీలాని సామూన్ వ్యవసాయ అధికారులను అదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఈక్రాప్ బుకింగ్, చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులపై రైతులకు అవగాహన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అత్యంత పోషక విలువలున్న చిరుధాన్యాల పంటలకు నీటి అవశ్యకత తక్కువగా ఉండడం, అధికంగా పంట ఉత్పత్తులు దిగుబడి అవుతున్న నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలందరు పోషకాలున్న చిరుధాన్యాల ఆహార పదార్థాలపై మక్కువ చూపుతున్నారని ఈమేరకు వ్యవసాయ అధికారులు ప్రత్యేక క్యాంపెయిన్‌లు, ర్యాలీలు నిర్వహించి రైతుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. రబీ పంటకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 9 శాతం ఈక్రాప్ బుకింగ్‌ను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. రైతుభరోసా, పిఎం కిసాన్ పథకాలు పెండింగ్‌లో ఉన్న 27,024 మంది రైతులు ఈకెవైసీని వెంటనే పూర్తిచేయాలని అదేశించారు. రసాయనిక ఎరువులు, విత్తనాలు పక్కదారి పట్టకుండా ఎరువుల దుకాణాలపై విస్తృత దాడులు నిర్వహించి రైతులకు సకాలంలో ఎరువులు అందేవిధంగా చూడాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టరు టి నిశాంతి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, డిఎస్ఓ ఆచార్యులు, నంద్యాల ఎడిఎ రాజశేఖర్, డోన్ ఎడిఎ అశోకవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## డెంగ్యూ అనుమానిత కేసులు

**-గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్యపనులు**

**వెల్దుర్తి,ఫిబ్రవరి1,ప్రభాతవార్త :** మండల పరిధిలోని చెరుకులపాడు గ్రామంలో డెంగ్యూ అనుమానిత కేసులు నమోదయ్యాయి.ఈ విషయం తెలుసుకున్న ఎంపిడిఓ శ్రీనివాసరావు,ఇఓఆర్డీ నరసింహులు ఆ గ్రామాన్ని బుధవారం సందర్శించి గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్యపనులను పరిశీలించారు.మురికినీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పిఎస్ రాధికకు సూచించారు.గ్రామమంతా మురికికాల్వలు శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.కాచి చల్లార్చిన నీటినే త్రాగాలన్నారు.దోమలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.దోమతెరలను వాడాలని ప్రజలతో వారు అన్నారు.

## కుష్టువ్యాధిపై అవగాహన

**మద్దికెర,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** కుష్టువ్యాధి పట్ల సమాజంలో అవగాహన పెంచడానికి మహాత్మగాంధీ వర్ధంతి జనవరి 30వ తేదీ నుండి ఫిబ్రవరి 13వరకు మండలంలోని ప్రతి సచివాలయంలో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నాగేష్ తెలిపారు. బుధవారం మండలం పరిధిలోని హంప సచివాలయం,అంగన్‌వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కుష్టువ్యాధిపై జరిగే స్పర్శ అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి కుష్టువ్యాధి సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. అనుమానస్పద కేసులను పరీక్షించి కుష్టువ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ భాషా మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని రాగిమచ్చలు,పొడలు,లావుగా మారిన నొప్పితో కూడిన నరములు,కాలు లేదా చేతుల కండరాలలో బలహీనత, చేతులు,పాదాలు,నరములలో తిమ్మిర్లుగా అనిపించడం,నొప్పిగా అనిపించని పుండు చేతులు,పాదాల్లో ఉండడం,కళ్ల పూర్తిగా మూసుకోలేకపోవడం,చెవి తమ్మెలు మందంగా మారిపోవడం,కాళ్ల నుండి చెప్పులు జారిపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్వీయ పరీక్ష చేసుకుని వైద్యుడిని సంప్రదించాలన్నారు. తదనంతరం కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమంపై జిల్లా కలెక్టర్,గ్రామ సర్పంచ్ సందేశాన్ని వినిపించి ప్రజలు,సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్ బాబు, హెల్త్ ప్రొవైడర్ దివ్య,సచివాలయ హెల్త్ సెక్రటరీ నాగమని,హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్‌రావు,ఆశా, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దరాజుపాలెంలో గడ్డివాము దగ్ధం

**బనగానపల్లెరూరల్,ఫిబ్రవరి1,ప్రభాతవార్త:** మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున బోయ రాముడు అనే వ్యక్తికి చెందిన గడ్డివాము దగ్ధమైంది.రాముడు రెండు రోజుల క్రితం ప్యాపిలి మండలం గార్లదిన్నె నుండి జొన్న చొప్ప ట్రాక్టర్ రూ.12వేలు ప్రకారం రెండు ట్రాక్టర్లు కొనుగోలుచేసి కల్లంలో వాము ఏర్పాటుచేసుకున్నారు.ఖర్చులతో కలిపి గడ్డివాము రూ.40వేలు విలువ అవుతుందని నష్టపోయిన రైతు రాముడు తెలిపారు.గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టి ఉంటారని రైతు రాముడు అనుమానం వ్యక్తం చేశారు.రెండేళ్ల క్రితం ఇలాంటి ఇదే రైతు రాముడికి చెందిన గడ్డివాము కాలిపోయింది.మరోసారి అతని గడ్డివాము కాలిపోవడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.చిన్నసన్నకారు రైతులుగా ఉన్న వారి గడ్డివాములు ఇలా కాలిపోతే వారు జీవనం కొనసాగించడం కష్టమవుతుందని సాటి రైతులు పేర్కొంటున్నారు.పోలీస్ అధికారులు దీని పై విచారణ చేసి దోషుల పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతుల గడ్డివాములు పరిరక్షింపజేయాలని గ్రామ రైతులు పోలీస్ అధికారులను కోరారు.గడ్డివాము దగ్ధమైన విషయం తెలుసుకున్న బనగానపల్లె ఎస్ఐ పి.రామిరెడ్డి సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి పరిశీలించారు.అక్కడున్న రైతులు జరిగిన సంఘటనలను ఎస్ఐకి వివరించారు.గ్రామస్తులు మంటలను అదుపు చేయడం వల్ల మంటలు ఇతర కల్లాలకు వ్యాపించకుండా వాములు కాపాడబడ్డాయని తెలిపారు.ఇతర గడ్డివాములకు మంటలు అంటుకుని ఉంటే అపార నష్టం జరిగి ఉండేదని రైతులు తెలిపారు.ఎస్ఐ దీని పై తగు విచారణ చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

## వాల్మీకులు అన్నిరంగాల్లో రాణించాలి

**కర్నూలు రూరల్,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలని వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థాన చైర్మన్ బేతం కృష్ణుడు అన్నారు. బుధవారం బిర్లాగేట్ సమీపాన వాల్మీకి బోయ సేవా సంస్థ కార్యాలయంలో వాల్మీకి బోయ సేవా సంస్థ డైరీని రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెడ్ మహేష్‌కుమార్,ఎల్లమ్మ దేవస్థాన చైర్మన్ బేతం కృష్ణుడు,ఆ సంస్థ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. తలారి కృష్ణ నాయుడు,జిల్లా అధ్యక్షులు కుబేర స్వామిల ఆధ్వర్యంలో ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ రామచంద్రుడు ఎండి,రిటైర్డ్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జి భవాని ప్రసాద్,సాంబశివ అసిస్టెంట్ లేబర్ కమీషనర్ సత్రం రామకృష్ణుడు కర్నూలు టిడిపి బిసి సెల్ అధ్యక్షులు డైరీ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లావ్యాప్తంగా వచ్చిన వాల్మీకి సోదరులు ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్బంగా బేతం కృష్ణుడు మాట్లాడుతూ వాల్మీకులందరు ఈరోజున సమావేశమై ఈ డైరీని ఆవిష్కరించడం ఎంతో శుభపరిణామమన్నారు. అలాగే వాల్మీకుల చరిత్ర ఎంతో ఘనమైనది వాల్మీకి మహర్షి మన జాతి వాడని మనందరం గర్వపడాలన్నారు. వాల్మీకులు విడిపోకుండ అందరు ఏకమై ఏ పార్టీలో ఉన్నా,ఏ వృత్తిలో ఉన్నా వాల్మీకులు రాజకీయంగా,ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలన్నారు. భవిష్యత్తులో ఈ వాల్మీకి బోయ సేవా సంస్థను మరింతగా విస్తరింపచేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన వాల్మీకి నాయకులు, గార్గేయపురం వైసిపి నాయకులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### వార్తప్రభావం..

## ఫార్మాసిస్టు,డాక్టర్ బదిలీ

**హొళగుంద,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన హొళగుందలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్,ఫార్మాసిస్టు ఇద్దరు బదిలీ అయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు సక్రమంగా నిర్వహించడం లేదని స్పందన కార్యక్రమంలో వీరిపై ఫిర్యాదు చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. డాక్టర్‌ని గజ్జహళ్లికి,ఫార్మాసిస్టును నంద్యాల జిల్లా దీబగుంట్లకు బదిలీ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

## గిరిజన ఎస్ఐ పై సస్పెన్షన్ సరికాదు

**బనగానపల్లె,ఫిబ్రవరి1,ప్రభాతవార్త:** బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ శంకర్‌నాయక్‌ను సస్పెండ్ చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజునాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం బనగానపల్లె పట్టణంలో పెట్రోల్‌బంకు నుండి ర్యాలీగా గిరిజనులు వచ్చి పోలీస్‌స్టేషన్ ఎదుట గిరిజనులు భారీ ఎత్తున ధర్నా చేపట్టారు.నిజాయితీగా పనిచేస్తే సస్పెన్షన్ బహుమత అంటూ నినాదాలు చేశారు.క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న గిరిజన ఎస్ఐ పై సస్పెన్షన్ సరికాదని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి మృతుడు దస్తగిరిని ఆసరాగా తీసుకుని సొంత కక్ష సాధింపు చర్యలు సిగ్గుచేటని ఆంధ్రప్రదేశ్ ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్ ఆరోపించారు.బనగానపల్లె ఎస్ఐ శంకర్‌నాయక్ సస్పెండ్ చేస్తున్నట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి ప్రకటించడం బాధాకరమని క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండానే కేవలం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆరోపణలతో ఎస్ఐ పై కేసు పెట్టడమే కాకుండా సస్పెండ్ చేయడం చాలా దారుణమని అన్ని గిరిజన సంఘాల నాయకులు తప్పుపట్టారు.ఎస్ఐ దుర్భాషలాడారని జనవరి 29వ శనివారం నాడు తల్లీ కొడుకులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారని దస్తగిరి మృతి చెందారని అయితే దీని తెరవెనుక మాజీ ఎమ్మెల్యే కుట్రపన్ని దస్తగిరిని ఫోన్‌లో రెచ్చగొట్టి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడండి అంటూ ప్రేరిపించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని ఆయన ఆరోపించారు.దస్తగిరి మృతికి కారణమైన వారి పై కేసు నమోదు చేయకుండా ఎస్ఐ శంకర్‌నాయక్‌ను బలి చేశారని ఆయన ఆరోపించారు.నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న అమాయక గిరిజన ఎస్ఐ పై నిందలు మోపి కక్షసాధింపు చర్యలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మీడియా ద్వారా తెలిపారు.దీన్ని అవకాశంగా తీసుకుని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి ఎస్ఐ శంకర్‌నాయక్‌ను ఇరికించి ఆయన సస్పెన్షన్‌కు కారణమయ్యారని ఆయన ఆరోపించారు.శంకర్‌నాయక్ సస్పెన్షన్‌ను ఎత్తివేసి పురుగుల మందు తాగడానికి ప్రేరేపించిన వారిని అదుపులోకి తీసుకుని సమగ్ర విచారణ జరిపించి న్యాయాన్ని గెలిపించి శంకర్‌నాయక్‌ను నిర్దోషిగా ప్రకటించి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.అందుకు నిరసనగా బనగానపల్లె పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం భారీ ఎత్తున గిరిజనులతో కలిసి మహాధర్నా ఏర్పాటు చేశారు.న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గిరిజన సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టి మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవినాయక్,ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు బాలునాయక్,వెలుగోడు వైస్ ఎంపిపి కొడావత్ శంకర్‌నాయక్,సంజీవనగర్ తండా సర్పంచ్ శివశంకర్‌నాయక్,వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ కార్యదర్శి శ్రీనివాసనాయక్,జీవీఎస్ విద్యార్థి విభాగం రవీంద్రనాయక్,నాగేష్ నాయక్,రామకోటి నాయక్,ఎంపిటిసి వెంకటేష్ నాయక్,చిన్నరాజుపాలెం తండా ఈశ్వర్ నాయక్,గుంతకందాల సుధాకర్ నాయక్,మాజీ సర్పంచ్ బాలు నాయక్,జీపీఎస్ ఉపాధ్యక్షులు మల్లేష్ నాయక్,జడాలయ్య నాయక్,భానుముక్కల రామస్వామినాయక్,బనగానపల్లె జీపీఎస్ ఇన్‌చార్జ్ రామచంద్ర నాయక్,ప్రధాన కార్యదర్శి అంజి,తిమ్మనాయక్,జయరామ్ నాయక్,వెలుగోడు వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ నీలా నాయక్,రామానాయక్,డోన్ కృష్ణనాయక్,అశోక్ నాయక్,సురేష్ నాయక్,మంగంపేట తండా మద్దిలేటినాయక్,శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపలో ఆనందోత్సవాలు : ఎమ్మెల్యే శ్రీదేవమ్మ



**తుగ్గలి,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలతో గడప గడపలో ఆనందోత్సవాలు వెల్లివిరుస్తున్నాయని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎమ్మెల్యే దత్తత గ్రామమైన జొన్నగిరిలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్ సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలను అందచేస్తూ ముందుకు దూసుకుపోతున్నారన్నారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు,వైకాపా మండల కన్వీనర్ జిట్టా నాగేష్,జడ్పిటిసి పులికొండ నాయక్,వైస్ ఎంపిపి ఎర్ర నాగప్ప,రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంతదేవి, ఎంపిటిసి ప్రతాప్‌రెడ్డి,వ్యవసాయ సంఘం మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి,గుంతా రఘు,తుగ్గలి మోహన్‌రెడ్డి,రాంకొండ సుధాకర్‌రెడ్డి,ఎర్రగుడి రామచంద్రారెడ్డి,రాంపురం గంగాధర్,ఓబులేష్,గోవిందు, బద్రి,రామాంజనేయులు, అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న మేలు మరువలేం : ఎమ్మెల్యే

**తుగ్గలి,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జగనన్న ప్రభుత్వం సచివాలయ,వాలంటరీ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మేలు మరువలేనివని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో సచివాలయ కన్వీనర్‌లకు గృహ సారధులకు,వాలంటరీలకు ఎమ్మెల్యే ఆద్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారన్నారు. నవరత్న పథకాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. చంద్రబాబు పాలనంత మోసాలతో సాగిందన్నారు. దీంతో జగనన్న ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులు,వాలంటరీలు, గృహసారధులు కన్వినర్లు ప్రతిఒక్కరు నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏమాత్రం నీరుగారిపోకుండ అర్హులైన ప్రతి లబ్దిదారునికి అందేలా పనిచేయాలని సూచించారు. అనంతరం సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, రాంపల్లి కొట్టాల వెంకటరాముడులు ఎమ్మెల్యే శ్రీదేవమ్మను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పులికొండ నాయక్,వైస్ ఎంపిపి ఎర్రనాగప్ప,రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంతదేవి, వ్యవసాయ సంఘం మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి,సచివాలయ కన్వీనర్ గుంతా రఘు,మండల కన్వీనర్ జిట్టా నాగేష్,తుగ్గలి మోహన్‌రెడ్డి,రామచంద్రరెడ్డి,అట్లా బసిరెడ్డి,రామకొండ సుధాకర్‌రెడ్డి,నుసరాల గోపాల్‌రెడ్డి,తేరప్ప, పక్కీరప్ప,లోకనాథ్‌రెడ్డి,కొత్తపల్లి గుడిసెలు వెంకటయ్య,రాంపురం గంగాధర్, ఓబులేష్,సర్పంచ్ కమల్‌భాష, గోవిందు,బాబునాయక్,రాము నాయక్,అశోక్ నాయక్,భీమా నాయక్,ఫీల్డ్ అసిస్టెంట్లు సందీప్,నాగిరెడ్డి, సుంకప్ప,రాము నాయక్,రఘురాంరెడ్డి,బద్రి తదితరులు పాల్గొన్నారు.

### నవరత్నాలు పేదలకు
## మరిన్ని కష్టాలు తెచ్చాయి



ఇదేం ఖర్మ కార్యక్రమంలో మాజీ మంత్రి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా

**నంద్యాల విద్య, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు బ్రతికేదే కష్టమైందని నవరత్నాల పేరుతో పేదలకు మరిన్నికష్టాలు వచ్చిపడ్డాయని గ్రామపంచాయితీల్లో పైసా నిధులు లేక పారిశుద్యలోపంతో అల్లాడుతున్నాయని పూర్వవైభవం రావాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఏకైకమార్గమని మాజీ మంత్రి ఎమ్మెల్సీ ఎన్ఎండి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం టిడిపి అదిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు మండలంలోని కొత్తపల్లె గ్రామంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న నాయకులకు టిడిపి నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం వీరు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్ ప్రభుత్వం గ్రామ పంచాయితీ సర్పంచుల అధికారాలు నిర్వీర్యం చేసిందన్నారు. నిధులు లేక కనీస సౌకర్యాలు సైతం కరువయ్యాయని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు పంచాయితీరాజ్ శాఖకు లోకేష్ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారని గుర్తుచేశారు. గ్రామాల్లో సిసి రోడ్లు, ఎల్ఇడి లైట్లు వేయిస్తే నేడు ఆ లైట్లు రిపేరీ చేసే పరిస్థితి కూడ లేదన్నారు. గ్రామాల్లో తిరిగి పూర్వవైభవం రావాలంటే చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని అందుకోసం ప్రతినాయకుడు, కార్యకర్తలు నిరంతర కృషిచేయాల్సి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీ కనుమరుగవుతుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మిరెడ్డి, కోటి లింగారెడ్డి, లక్ష్మయ్య, లాయర్లు రామ్‌మనోహర్‌రెడ్డి, కృష్ణారెడ్డి,మనోహర్‌రెడ్డితో పాటు మండల కన్వీనరు గురునాథరెడ్డి, రమణారెడ్డి,ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యా నాకు ఫించన్ ఇవ్వండి

### - ఓ వికలాంగురాలు ఆవేదన



ఫించన్ అందని వికలాంగురాలు

**ఆదోని రూరల్,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** మండల పరిధిలోని నాగనాథనహల్లి గ్రామంలో వికలాంగురాలు నాగమ్మ అనే మహిళ ఎమ్మెల్యేను ఫించన్ అందచేయండి అని కోరింది. అయితే ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఎటువంటి సమాధానం ఇవ్వకుండ చేద్దాంలే అంటూ జారుకున్నాడు. బుధవారం మండల పరిధిలోని నాగనాథనహల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చేపట్టారు. ఎమ్మెల్యే సాయి గడప గడపకు తిరుగుతూ ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. అలాగే కొందరికి రైతుభరోసా డబ్బులు పడినట్లు చూపింది కానీ తమ ఖాతాలో డబ్బులు జమకాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి జనార్ధన్,మున్సిపల్ చైర్మన్ శాంత, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నాగమల్లయ్య,ఏపిఓ చంద్రశేఖర్,ఏపిఎం జనార్ధన్, సర్పంచ్ వరదప్ప,వైసిపి యువ నాయకులు వల్లభరెడ్డి,వైసిపి సోషల్ మీడియా నాయకులు ఉల్లెప్ప,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మడివాల మాచిదేవ జయంతి వేడుకలు

**మంత్రాలయం,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త:** రజకుల కులదైవమైన మడివాల మాచిదేవ జయంతి వేడుకలు బుధవారం నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో ఘనంగా జరిగాయి.ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి హాజరయ్యారు.ఈ వేడుకలను పాతూరులో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిర్వహించారు.ముందుగా ప్రదీప్‌రెడ్డి మడివాల మాచిదేవ చిత్రపటానికి పూలమాల వేసి.జ్యోతి ప్రజ్వలన చేసి,నారికేళాలు సమర్పించారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నుండి ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా మడివాలప్ప ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున,వైస్ ఎంపిపి రాఘవేంద్ర,ఉప సర్పంచ్ పరమేష్,ఎంపిటిసి వెంకటేష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాల విద్యార్థి ఆత్మహత్యయత్నం

**వెల్దుర్తి,ఫిబ్రవరి1,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలో సత్యసాయి పాఠశాలలో పదోతరగతి చదవుతున్న విద్యార్థి శివ బుధవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు సమాచారం.కుటుంబసభ్యులు గమనించి వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యచికిత్సలు చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు తెలిసింది.

## కంది పంట రైతుకు ఆర్థిక సహాయం



**తుగ్గలి,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామలింగయ్య పల్లి గ్రామానికి చెందిన కురువ గోవిందు అనే రైతు తన 8ఎకరాల పొలంలో వేసిన కంది పంట అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధం కావడం జరిగినది. దీంతో ఆ గ్రామంలోని వైసీపి నాయకులు రంగనాథ రెడ్డి,నాగిరెడ్డిలతో పాటు ఆ గ్రామములోని రైతులు నష్టపోయిన రైతుకు తలా ఇంత ఆర్థిక సహాయాన్ని నష్టపరిహారంగా పోగుచేసి కురువ గోవిందు అనే రైతుకు జొన్నగిరిలో ఎమ్మెల్యే శ్రీదేవమ్మ చేతుల మీదుగా రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో ఆ రైతు ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు ఆ గ్రామంలోని స్థానిక వైసీపి నాయకులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు.

## మద్యాహ్న భోజనాన్ని పరిశీలించిన విద్యార్థి సంఘాలు

**మద్దికెర,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** వార్త దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి మద్దికెరలోని స్థానిక కెవిఆర్ గర్ల్స్ స్కూల్,కొండమ్మ బావి దగ్గర గల ఆదర్శ పాఠశాలలో మద్యాహ్న భోజనాన్ని విద్యార్థి సంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద పథకంలో ఉన్న మెనూ ప్రకారం విద్యార్థులకు సరైన భోజనం అందించాలన్నారు. భోజనం సరిగా లేదని విద్యార్థులు ఇంటికి వెళ్లి భోజనం చేయడం,క్యారియర్‌లు తెచ్చుకోవడం జరుగుతుందని మండిపడ్డారు. నాణ్యమైన భోజనం అందించని పాఠశాలల లిస్ట్ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు పీరా,మండల సహాయ కార్యదర్శి ఆకాశ్‌లు పాల్గొన్నారు.

## నిత్యన్నదాన వితరణ పథకానికి దాత విరాళం

**శ్రీశైలంప్రాజెక్టు,ఫిబ్రవరి01,ప్రభాతవార్త :** శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యన్నదాన వితరణ పథకానికి మహారాష్ట్ర వాస్తవ్యులు కొండ వెంకటనారాయణరెడ్డి అనుదాత రూ. 1,01,116/-ల విరాళమును సహాయ కార్యనిర్వహణాదికారి ఫణి దంప్రసాద్‌కు దాత అందజేసారు.ముందుగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకోని అనంతరం విరాళం అందజేసారు.తదుపరి దాతలను శ్రీస్వామి వార్ల శేషవస్త్రాలతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేసారు.

## జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ మైనార్టీ నేతగా సయ్యద్ జాహీద్ నియామకం

**బనగానపల్లెరూరల్,ఫిబ్రవరి1,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణానికి చెందిన సయ్యద్ జాహీద్ బిన్ మహమ్మద్ నంద్యాల జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ మైనార్టీ మోర్చ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు.ఈ మేరకు ఆయన ఆమ్‌ఆద్మీ పార్టీ రాయలసీమ జోన్ కన్వీనర్ బి.వి.సుబ్బారెడ్డి ద్వారా నియామక పత్రాన్ని బుధవారం అందుకున్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాట భవాని,వరప్రసాద్‌ల ఆదేశాల ప్రకారం రాయలసీమ జోన్ కన్వీనర్ బి.వి.సుబ్బారెడ్డి తమను నియామకం చేసినట్లు జాహీద్ బిన్ మహమ్మద్ తెలిపారు.ఇందుకు బి.వి.సుబ్బారెడ్డి,వరప్రసాద్‌లకు జాహీద్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తా

### :-ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి

**మంత్రాలయం,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తానని ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి అన్నారు.బుధవారం మండల పరిధిలోని మాధవరం,మంత్రాలయం,చిలకలడోణ, వగరూరు, సూగూరు,తుంగభద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు.ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై అరాతీశారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లాఅధ్యక్షులు యల్లప్ప,ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ పాల్గొన్నారు.

## స్టడీ టూర్ సారథికి సత్కారం

**డోన్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** ఇటీవల స్టడీ టూర్‌కు గ్రేటర్ సిటీ విశాఖ, పోలవరం తదితర ప్రాంతాలకు డోన్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు స్టడీ టూర్ నిర్వహించారు. స్టడీ టూర్ ఏర్పాటుచేసేందుకు ముఖ్యులైన మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ను పాలకవర్గ సభ్యులంతా కలసి బుదవారం ఆత్మీయంగా సత్కరించారు. పాలనాపరంగా ఎన్నో విషయాలను తెలుసుకునేందుకు స్టడీ టూర్ ఎంతో ఉపయోగపడిందని ఈ సందర్భంగా వారు చెప్పారు. ఇందుకు కారకులైన ముఖ సారథిగా వ్యవహరించిన చైర్మన్‌ను అభినందిస్తూ ఆత్మీయంగా సత్కరిస్తున్నట్లు కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, టిఇ దినేష్‌గౌడ్, దారా హరినాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, రైల్వే నాగేంద్ర, మేకల విమల, సాదిక్ అహ్మద్, ఇంతియాజ్ కాలేసా, ఆర్ట్ రమణ, సుజాత, బద్దల సుబ్బలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, సుమలత, కళావతి, కుమ్మరి రాజు, వెంకటరాముడు, వైకాపా నాయకులు కురుకుంద హరిప్రకాష్, కుల్లాయి, బుర్రు శ్రీధర్, మేకల రాజు, ఇందిరానగర్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పంటలను నమోదు చేసుకోవాలి

**బనగానపల్లె,ఫిబ్రవరి1,ప్రభాతవార్త:** రైతులు ఈ క్రాఫ్ కింద తాము వేసిన పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు.బుధవారం మండలంలోని అప్పలాపురం,విఠలాపురం మరియు సంకలాపురం గ్రామాల్లో పంటల ఈ నమోదు ప్రక్రియను వ్యవసాయాధికారి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈక్రాఫ్ కింద వారి పంటలు త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు.పంట నమోనదు ఈక్రాఫ్ కింద సరిగా జరిగిందా లేదా అన్న విషయాన్ని కమిషనర్ నుండి వచ్చిన సర్వే నంబర్ వారిగా సూపర్ చెక్‌లో భాగంగా జొన్న,శనగ పంటల నమోదును సంకలాపురం గ్రామంలో పరిశీలించారు.నమోదుచేసిన పొలాల సర్వేనంబర్లు,పంటల వివరాలు సరిగ్గా ఉన్నట్లు గమనించారు.రైతులు ఈ క్రాఫ్ నమోదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.ప్రతిఒక్క రైతు ఈక్రాఫ్ కింద తాము వేసిన పంటలను నమోదు తప్పక చేయించుకోవాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు.

## మహాసభలను జయప్రదం చేయండి

**పత్తికొండ,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి నజీర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చదువుల రామయ్య భవనం నందు మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా నూతన జాతీయ విద్యావిధానం 2020ని రాష్ట్రంలో ప్రవేశపెట్టడాన్ని ఏఐఎస్ఎఫ్ వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ పాఠశాలలు ప్రైవేటు పరం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అమ్మఒడి,విద్యాదీవెన,వసతి దీవెన వివిధరకాల పేర్లతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆకట్టుకుని ఏడాది గడవకముందే ఆ పథకాలలో కోత విధిస్తామని చెప్పడాన్ని తప్పుబట్టారు. పూటకోమాట మాట్లాడితే భవిష్యత్తులో మీ ప్రభుత్వం కొట్టుకుపోయే పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్,మండల సహాయ కార్యదర్శి మా భాష,ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్,రాజు,రమేష్, విష్ణు, ఉపేంద్ర తదితరులున్నారు.

## రాజధానిని విశాఖకు తరలిస్తే ఉద్యమం తప్పదు

**నంద్యాల రూరల్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** ఏపీ రాజధాని అమరావతి కాకుండా రాజధానిని విశాఖకు తరలిస్తే ఉద్యమం తప్పదని సిపిఐ నాయకులు హెచ్చరించారు. సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అధ్యక్షతన బుధవారం అమరావతే రాజధానిగా కొనసాగించాలని కోరుతూ సిపిఐ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ రాజధానిని విశాఖకు తరలిస్తామని ప్రకటించడం శోచనీయమన్నారు. ఈనిర్ణయాన్ని విరమించుకోవాలని లేకుంటే అందోళన తప్పదని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో వున్నప్పుడు అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర రాజధాని అమరావతి ఏర్పాటుకు పదివేల ఎకరాల భూమి సరిపోదని 30 వేల ఎకరాల భూమి కావాలని అసెంబ్లీలో మాట్లాడిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాటమార్చి అమరావతి రాజధాని వద్దు విశాఖ రాజధాని కావాలని ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దిన్, నాయకులు ధనుంజయుడు, నాగరాముడు, సోమన్న, ఏఐటియుసి నాయకులు డి శ్రీనివాసులు, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రవి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారులకు సిబ్బంది సత్కారం

**బనగానపల్లె,ఫిబ్రవరి1,ప్రభాతవార్త:** బనగానపల్లె మండలం ఎంపిడివో మరియు గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఏ.శివరామయ్య,గ్రామ పంచాయతీ ఈవో ఖలీల్‌ను సిబ్బంది బుధవారం సత్కరించారు.వారిద్దరు ఉత్తమ సేవలతో గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ సేవా పురస్కారాలను ఉన్నతాధికారుల చేతుల మీదుగా పొందారు.ఎంపిడివో శివరామయ్య పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా కొద్ది సంవత్సరాలుగా ఉత్తమ సేవలు అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.అలాగే ఎంపిడివో సూచనలు,సలహాలు పాటించడం వల్ల ఖలీల్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించారు.వారి సేవలను గుర్తించిన జిల్లా కలెక్టర్ గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ సేవ పురస్కారాలతో వారిని సత్కరించారు. బనగానపల్లె గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు ఎంపిడివో కార్యాలయ సిబ్బంది ఈ ఇద్దరు అధికారులను మండలస్థాయిలో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో కార్యాలయ ఏవో నాగరాజు,సీనియర్ అసిస్టెంట్ కాశీనాథ్,జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి,కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మిరెడ్డి,పంచాయతీ కార్యదర్శులు శివశంకర్‌నాయక్,రామేశ్వర్,గురుప్రసాద్,శ్రీనివాసులు,ప్రకాశం,గోవర్ధన్,లక్ష్మినారాయణ,మహేష్,సుభాషిణి,స్వర్ణలత,సునీత,సుబ్బమ్మ,శకుంతల,వేదావతి,మనోపర్,లిఖిత,మనోజ్,భార్గవి,సువర్ణ,శ్రీప్రవల్లిక,చంద్రశేఖర్,సుబ్బయ్య,మంజునాథ్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండుగలా లంకాదహనం

**హొళగుంద,ఫిబ్రవరి 1,ప్రభాతవార్త :** హొళగుందలో శ్రీ సిద్దేశ్వర స్వామి రథోత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన లంకాదహనం కార్యక్రమంలో అశేష జనవాహిని మధ్య కన్నులపండుగగా జరిగింది. ఈ సందర్బంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం,వారి సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి,మంత్రి తనయుడు గుమ్మనూరు ఈశ్వర్,శిరుగుప్ప ఎమ్మెల్యే సోమలింగప్ప,ఆలయ ధర్మకర్త రాజాపంపన్నగౌడ్,సిద్దార్థగౌడ్‌లు లంకాదహనాన్ని ప్రారంభించారు. అంతకుముందు శ్రీ సిద్దేశ్వర స్వామి దేవాలయ సన్నిధిలో మంత్రి తనయుడు,సోదరులు,శిరుగుప్ప ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాజా పంపన్నగౌడ్ వీరికి పూలమాల,శాలువాతో సన్మానించారు. అనంతరం వారు లంకాదహనాన్ని తిలకించారు. ఈ సందర్బంగా గుమ్మనూరు నారాయణస్వామి, ఈశ్వర్‌లు మాట్లాడుతూ శ్రీ సిద్దేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. దేవాలయ ఆవరణలో లంకాదహన కార్యక్రమం గంటపాటు జరిగింది. విచ్చేసిన భక్తులు ఆనందంలో మునిగితేలారు. సిఐ ఈశ్వరయ్య,ఎస్ఐ అబ్దుల్ జహీర్ ఆద్వర్యంలో భారీ పోలీస్‌బందోబస్తు నిర్వహించారు. వైకాపా మండల కన్వీనర్ షఫీవుల్లా, సింగిల్‌విండో చైర్మన్ మేలిగిరి మల్లికార్జున,ఆలూరు వైకాపా మండల కన్వీనర్ వీరేష్, కుమారస్వామి, హనుమప్ప,ఇంగళదహాలు మల్లికార్జున, తోక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

1117, D Block, Yehukul Heights, Uluchal Road, Kurnool ltd,

కాంటాక్ట్ నెం:8849085177

**YEMMIGANUR MUNICIPALITY**
**e-procurement tender notice**

Notice No. 27/General Fund/2022-23, dt.01.02.2023

| | | |
|---|---|---|
| 1 | Total No. of Work | 1st Call- 2 Nos. |
| 2 | Value of Work | 3.35 Lakhs |
| 3 | Bid document download starting date | 02-02-2023 at 10.30 A.M |
| 4 | Bid document download end date | 06-02-2023 at 3.00 P.M |
| 5 | Last Date & Time for receipt of Bids | 06-02-2023 at 3.30 P.M |
| 6 | Commercial Bid opening Date | 06-02-2023 at 4.00 P.M |
| 7 | Name & Address of the Concerned Officer | Commissioner, Yemmiganur Municipality, Yemmiganur. Fax: 08512-228050 Ph.No.08512-255050 Email: commissioner_ygr@yahoo.com |

The details of name of work, Tender document, Eligibility Criteria. Bid Submission & Price Bid opening date and EMD details etc., may be seen on e-procurement market place available @eprocurement.gov.in

Commissioner
Yemmiganur Municipality.

**శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానము శ్రీశైలం.**

**ఆర్.సి.నెం.యస్ 3/117/2023**

శ్రీశైల దేవస్థానము సెక్యూరిటీ విభాగమునకు అవసరమైన Rtd.D.S.P. హోదాలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసరు (C.S.O.) ను రెండు (2) సం.కాలపరిమితికి గాను కనీసం 5 సం.లు D.S.P. హోదాలో విధులు నిర్వర్తించియుండి. పదవీ విరమణ చేసినవారు 65 సం. లోపు వయస్సు లోపు అయ్యి వుండి హిందువు అయ్యి, దైవభక్తి కలిగియున్న వారిని (ఉచిత రూము, వాహన సౌకర్యంతో ) C.S.O నియామకం చేసుకొనుట జరుగును. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వేతనం నిర్ణయించబడును.

పై అర్హతలు కలిగిన వారు తేది: 05.02.2023 సమయం సాయంత్రం 5.గం. లోపు కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయమునకు చేరునట్లుగా వారి యొక్క బయోడేటా ధృవీకరణ పత్రములను సంబంధిత సర్టిఫికెట్లు శ్రీశైల దేవస్థానము పరిపాలనా భవనంలో సమర్పించవలసినదిగా తెలియజేయడమైనది. అవసరమైన సమాచారము కొరకు 9440991668, 7799045111 కార్యాలయ వేళలలో సంప్రదించవచ్చును.

శివకార్యంలో....... సం -
యస్.లవన్న
కార్యనిర్వహణాధికారి

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఉపముఖ్యమంత్రికి ఆహ్వానం



ఉపముఖ్యమంత్రికి ఆహ్వానం అందజేస్తున్న ఈఓ



ఉపముఖ్యమంత్రికి ఆహ్వానం అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంప్రాజెక్టు, పిబ్రవరి01, ప్రభాతవార్త శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో పిబ్రవరి 11 నుండి 21 వరకు అత్యంత వైభవంగా జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలకు ఏపి ఉపముఖ్యమంత్రి మరియు దేవదాయశాఖ మంత్రివర్యులు కొట్టు సత్యనారాయణను బుదువారంనాడు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండింతులు, ఆధ్యాపక, అర్చకస్వాములు సంయుక్తంగా కలసి మహాశివరాత్రి బ్రహ్మత్స వాలకు ఆహ్వానించడం జరిగింది. తదుపరి వేదఆశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసారు. అదే విధంగా దేవదాయశాఖ కమీషనర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ కార్యలయంలో శ్రీశైలందేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న కలసి మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలకు ఆహ్వానించడం జరిగింది.

## రాయలసీమ ఉద్యమ యువనాయకుడు

# సీమకృష్ణ ఇంటిపై దాడి

**అర్థ రాత్రి 12:00 గ ంటలకు గుర్తు తెలియని వ్యక్తులు...**

**రెండు ద్విచక్రవాహనాలు ధ్వంసం....**

**మొత్తం మూడు ద్విచక్ర వాహనాలలో ఏడుమంది రాడ్లతో కట్టెలతో దాడి....**

**కర్నూలు క్రైమ్ ఫిబ్రవరి, 01, ప్రభాతవార్తః-** కర్నూలు పట్టణంలో బిక్యాంప్‌లో నివాసముంటున్న రాయలసీమ ఉద్యమ యువనాయకుడు సీమకృష్ణ ఇంటి వరండాలో మంగళవారం అర్థరాత్రి 12:30 గంటల సమయంలో ప్రవేశించి రెండు ద్విచక్రవాహనాలు ధ్వంసం చేయటం జరిగింది. ఈ సందర్భంగా రాయలసీమ ఉద్యమ యువనాయకుడు సీమకృష్ణ మాట్లాడుతూ నా ఇంటిపై ఉద్దేశపూర్వకంగా దాడిచేసారని అన్నారు. అయితే ఈ ఘటనపై కర్నూల్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలయజేశారు.

# విధ్యార్థుల భవిష్యత్‌కు పునాది ఉపాధ్యాయులే

**:-పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి**

**:-సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్**



మధ్యాహ్న భోజన రుచిని చూస్తున్న సబ్ కలెక్టర్

**చిలకలడోణ(మంత్రాలయం), ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** విధ్యార్థుల బంగారు భవిష్యత్‌కు ఉపాధ్యాయులే పునాది లాంటివారని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంత్రాలయంలోని ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కస్తూర్బా విధ్యార్థినులతో మాట్లాడారు. విధ్యార్థినులకు పాఠాలు బోధి ంచారు. అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన రుచిని తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ నాడు-నేడు పనులకు రూ.కోట్ల నిధులను వెచ్చిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులను కోరారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వెల్లడించారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలోర్భిణీల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటకప్పుడు పర్యవేక్షించాలని వైద్య సిబ్బందిని కోరారు. సచివాలయాలకు ఎవరైనా సమస్య పరిష్కరించాలని వస్తే సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా సమస్య పరిష్కరించాలని వెల్లడించారు. వీరివెంట తహశిల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ ప్రభావతి, ఎంఈఓ మెయినుద్దీన్, కెజిబివి ప్రిని ్సపల్ శాంతి, హెచ్‌ఎం నాగరాజు తదితరులు ఉన్నారు.

# హత్యయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి...



నిందితులపై ఎస్సై ప్రేమ ఏంటో అర్థం కాదం లేదు.... బాధితుడి పేరు బెస్త రఘు..

**కర్నూలు క్రైమ్ ఫిబ్రవరి, 01, ప్రభాతవార్తః-** కర్నూలు నగరం కల్లూరు రామాలయం వద్ద వందన ఫుడ్స్ యజమాని బి రఘుపై ముగ్గురు వ్యక్తులు కళ్ళలో కారం చల్లి ఇనుప రాడ్‌తో కొట్టి బ్లడ్ లతో శరీరాన్ని కోసి తీవ్రగాయాలకు గురిచేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న బెస్త రఘు ఆయన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి గల కారణాలు వెల్లడించారు. వందన ఫుడ్స్ పేరుతో బేకరీ వస్తువులు తయారుచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎస్టేట్‌కు చెందిన చలపతి అనే వ్యక్తి వద్ద బేకరీ నిమిత్తం మైదా పిండి కొనుగోలు చేస్తూ జెకె చలపతికి రూ.30వేలు చెల్లిస్తూ పరిచయం అయినట్లు పేర్కొన్నారు. మైదాపిండిలో నాణ్యత లోపించడంతో చలపతి వద్ద మైదాపిండి కొనుగోలు నిలిపివేయడం జరిగింది. ఇందుకొసం కక్షతో జెకె చలపతి అతని అనుచరులు శ్రీనివాసులు జె.నరేంద్రబాబులతో కలిసి గతంలో కూడా ఒకసారి మా బేకరి దగ్గరకు వచ్చి షాపులోని ఫర్నిచర్ ను ధ్వంసం చేసి మాపై దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఆదే సందర్భంగా లాయర్ ద్వారా 2022 మే 23వ తేది నాడు లీగల్ నోటీసు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ నోటీసు పంపించినందుకు జనవరి 28వ తేదిన కల్లూరులోని రాముడి దేవాలయము గుడి దగ్గర రోడుపైన నేను వస్తుంటే జెకె చలపతి(టూవీలర్ వెహికల్ నెం:ఏపీ 21 ఏఎ3566 జె నరేంద్రబాబుశ్రీనివాసులు వీరు ముగ్గరు కలిసి వచ్చి నా పై కారం చల్లి ఎడమచెయ్యి బ్లైడ్‌తో కోసి ఛాతి దగ్గర బ్లేడుతో కోసి ముక్కుపై పిడిగుద్దులు గుద్ది నిన్ను చంపుతాము కొడకా అని వళ్ళు విరగొట్టినారు. అదే విధంగా పైపుతో వీపుపై కొట్టడంతో ఎముక పక్కకు జరిగింది. ఇది జరిగిన తరువాత వై శ్రీలత అనే మహిళా గుడి నుంచి బయటకు వచ్చి నన్ను చూసి మా అన్నకు ఫోన్ చేసింది. శివలోకేష్ అనే అబ్బాయిలు చూసి మా అన్నకు ఫోన్ చేశారు. అప్పుడూ మా అన్న బి రవి వచ్చి చేసి 108కు ఫోన్ చేసాడు 108 వాహనము సిబ్బంది నన్ను ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు చేర్పించారు. వైద్యులు నా యొక్క స్థితిగతిని పరిశీలించి ఎముక జరిగిందని అన్నారు. డాక్టరు. ఎక్స్ రే తీయించారు ఎంఎల్‌సి చేశారు. ఈ సందర్భంగా నాల్గవ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన తనను ఎస్సై రామయ్య భయభ్రాంతులకు గురిచేయడం నిందితుల అడ్వకేట్ ద్వారా సంప్రదింపులు జరిపిన తరువాతే కేసు నమోదు చేస్తామని చెప్పాడం సరైంది కాదన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్ కు వెళితే పోలీసులు ఇలా ప్రవర్తించడం వల్ల పోలీసు శాఖకు చెడ్డ పేరు వస్తుందన్నారు. ఒక వేళ నిందితులు దాడి చేసి హత్య చేసి ఉంటే మా కుటుంబం పరిస్థితి ఏంటని ఆవేదన చెందారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం జరిగేలా దర్యాప్తు ప్రారంభించి నిందితులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో మానవ హక్కుల వేదికను అశ్రాయించాల్సి వస్తుందని ఆయన తెలిపారు. ఈ విషయం పై విలేఖరులు కర్నూలు డిఎస్పీ కేవి మహేష్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన డిఎస్పీ బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

# మన విశాఖ...మన రాజదాని



**డోన్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** వచ్చే మార్చినుంచి మన రాజదాని విశాఖయేనంటూ ఢిల్లీలోని ఎకనమిక్ ఫోరంలో వెల్లడించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి డోన్ మున్సిపల్ కౌన్సిల్ ముక్తకంఠంతో జై కొట్టింది. అభివృద్ధి చెందిన పట్టణం రాజదానిగా వుంటే పెట్టుబడుల కొరత వుండదని, వ్యాపార దిగ్గజాలు, బడా పారిశ్రామికవేత్తలు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింపచేసుకునేందుకు తరలివస్తారని దీంతో సిఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతి స్తున్నామంటూ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అద్యక్షతన జరిగిన కౌన్సిలర్లు, వైకాపా లీడర్ల సమావేశంలో మూకుమ్మడి అభిప్రాయాన్ని వెల్లడించారు. మున్సిపల్ సమావేశపు భవనంలో బుదవారం కౌన్సిల్ సభ్యులు, వైకాపా ముఖ్యులు విస్తృతస్థాయి ప్రెస్‌మీట్‌ను నిర్వహించారు. ఛైర్మన్ సప్తశైల రాజేష్, వైఎస్ ఛైర్మన్ జాకీర్ హుస్సేన్, సీనియర్ కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, టిఇ దినేష్‌గౌడ్, ఇంతియాజ్, దారా హరినాథరెడ్డి, కటిక వేణులు మాట్లాడుతూ విశాఖకు ఎంతో ఘన చరిత్ర వుందని చెప్పారు. జాతీయ స్థాయిలో వరల్ ్డ క్లస్ సిటీ అవార్డును వరుసగా మూడోసారి ఎంపికైన క్లీన్‌సిటీ విశాఖయని అన్నారు. అటువంటి ప్రసిద్దిచెందిన, అభివృద్దిచెందిన నగరాన్ని రాజదానిగా చేసుకుంటే వ్యాపారదిగ్గజాలు పెట్టుబడులు పెట్టేందుకు ఎంతో ఆసక్తిని చూపుతారని అన్నారు. ఎక్కడైనాకాని వ్యాపారవేత్తలు రావాలంటే ఆ ప్రాంతం అన్నింటికి అనువుగా వుందా లేదా అన్నది చూస్తారని అభివృద్ధి చెందని ప్రాంతాల్లో వ్యాపారాలను పెట్టేందుకు ఎవ్వరూ ఇష్టపడరని అన్నారు. అదేతప్పును చంద్రబాబునాయుడు చేసి రాష్ట్రాన్ని అదోగతిపాలు చేసారని అన్నారు. విభజన జరిగిన తర్వాత ఇంతలా వెనుకబడి పోవడానికి కారణం బాబు తీసుకున్న అనాలోచితమైన నిర్ణయాలేనన్నారు. విశాఖ పట్టణం రాజదానిగా చేసుకుంటే రాష్ట్రంలోని ఎంతోమందికి ఉపాది దొరికే అవకాశలతోపటు న్యాయరాజదానిగా కర్నూలు, లెజిస్లేటివ్ రాజదానిగా అమరావతి వుంటుందని అన్నారు. దీనివల్ల అన్ని ప్రాంతాలుకూడా సమానంగా అభివృద్ధి చెందగలవన్న నిర్ణయంతోనే సిఎం జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. దీన్ని రాష్ట్రప్రజలందరూ హర్షిస్తున్నారని చెప్పారు. విశాఖకు రవాణా మార్గాలుకూడా అనేకం ఉన్నాయని విమాన, రైలు మార్గాలు సులువుగా ప్రతిరోజు ఉన్నాయని చెప్పారు. మేదావులు, ప్రజలుకూడా మన విశాఖ, మన రాజదాని నిర్ణయాన్ని ప్రతి ఒక్కరు వ్యక్తంచేయలని ఇది అందరికీ ఎంతో మంచి చేసే ఆలోచనయని చెప్పారు. సమావేశంటలో మున్సిపల్ కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, మల్లిరెడ్డి, రైల్వే నాగేంద్ర, మేకల విమల, సాదిక్ అహ్మద్, హరినాథరెడ్డి, ఇంతియాజ్ కాలేసా, ఆర్ ్ట రమణ, సుజాత, బద్దల సుబ్బలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, సుమలత, కళావతి, కుమ్మరి రాజు, వెంకటరాముడు, వైకాపా నాయకులు కురుకుంద హరిప్రకాష్, కుల్లాయి, బుర్రు శ్రీధర్, మేకల రాజు, ఇందిరానగర్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కౌలుట్ల చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**దేవనకొండ, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ నందు వెలసిన శ్రీ కౌలుట్ల చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్స వాలు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ఆర్ హనుమంతరెడ్డిల ఆద్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్స వాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారికి పర్వతరోహణం తదితర పూజలు నిర్వహించారు. నేడు ధ్వజారోహణం, 3న స్వామి వారి కళ్యాణోత్స వం, సేశావాహణము, 4న హనుమద్వాహనము, 5న గజవాహన ఉత్స వం, స్వామి వారి రథోత్స వం, 6న అశ్వ వాహనం, వసంతోత్స వం, గ్రామోత్స వం వంటి కార్యక్రమాలు జరుపుతున్నట్లు తెలిపారు.

# ఇండస్ట్రీస్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



**ఓర్వకల్, ఫిబ్రవరి01, ప్రభాతవార్త ;** పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ఓర్వకల్ మండలం బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలోని ఎంఎస్‌ఎంఈ పార్కు వద్ద 85 సెంట్ల స్థలంలో రూ.4.5 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఎస్‌ఎన్‌ఎస్ సుధీర్ ఇండస్ట్రీస్ నిర్మాణానికి బుధవారం పాణ్యం ఎమ్మెల్యే, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇండస్ట్రీలు వస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రతిఒక్కరికీ పనులు దొరికే అవకాశం ఉంటుందన్నారు. దీంతో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇంద్రస్ట్రీ నిర్మాణానికి భూమిపూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. కర్నూలు నగర మార్కెట్‌యార్డు చైర్మన్ మీది వేముల ప్రభాకర్‌రెడ్డి, ఓర్వకల్ జెడ్పీటీసీ రంగనాథ్, ఎంపీపీ తిప్పన్న, ఇండస్ట్రీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీభరత సంజీవరాయని సన్నిధిలో బండలాగుడు పోటీలు

**మిడుతూరు, ఫిబ్రవరి01, ప్రభాతవార్త ;** మండలంలోని రోళ్లపాడు గ్రామ పరిధిలో వెలిసిన శ్రీభరత సంజీవరాయ స్వామి 12వ వార్షికోత్స వం సందర్భంగా ఏర్పాటుచేసిన ఆరు పళ్ల విభాగం పోటీలు రెండో రోజు బుధవారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఈ పోటీల్లో 19 జతల ఎద్దులు పాల్గొననున్నాయి. మొదటి, రెండో, మూడో, నాలుగో, ఐదవ, ఆరో బహుమతులుగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, మాజీ సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, దేవాలయ ధర్మకర్త పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కార్యదర్శి వంగాల రామకృష్ణారెడ్డి, దేవాలయ కమిటీ సిబ్బంది, వివిధ గ్రామాలు చెందిన నాయకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



# ఆర్థిక నేరగాళ్ల బారిన పడుతున్న బాధితుల సంఖ్య

- సైబర్ నేరాలతోపాటు ఉద్యోగుల పేరుతో నిరుద్యోగ యువతకు కుచ్చుటోపీ
- ఆధారాలులేక ఇచ్చిన డబ్బులు ఇప్పించేవారు లేక దిక్కుతోచని పరిస్థితుల్లో బాధితులు
- నేరగాళ్లు యథేచ్ఛగా వారి వారి పనుల్లో బిజీ బిజీ
- ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ఉద్యోగాల పేరుతో యువతకు కుచ్చుటోపీ


ENTRANCE PASS LETTER

ముఠా సృష్టించిన ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్

**బేతంచెర్ల, ఫిబ్రవరి01, ప్రభాతవార్త:** పేద, మధ్య తరగతి జనంతోపాటు ఉపాధిలేక నిరుద్యోగంతో నిరాశ, నిస్పృలకు గురైన మహిళలను, యువతను టార్గెట్ చేస్తూ ఆర్థిక నేరగాళ్లు తమదైన శైలిలో వలపన్ని లక్షలకు లక్షలు దోచుకుంటున్నా వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో బేతంచెర్ల మండలంలోని గత కొన్ని సంవత్స రాలుగా ఆర్థిక నేరగాళ్ల వలలో చిక్కుకుని పేద, మధ్య తరగతి జనం, పలువురు మహిళలు, యువత, బాధితుల సంఖ్య భారీగా పెరుగుతుంది. లబోదిబోమన్న సైబర్ నేరగాళ్ల బారిన పడిన బాధితులకు ఎలాంటి రికవరీ వచ్చే అవకాశంలేదని ముందుగానే అప్రమత్తంగా ఉండాలని అధికారులు బహిరంగంగానే వెల్లడించడం జరుగుతుంది. అయినా పలువురు సైబర్ నేరాలకు గురైనవారు ఉన్న సొమ్మును పోగొట్టుకుని బయటకు చెప్పుకోలేక తేలుకుట్టిన దొంగల్లాగా ఉండిపోయారాన్న మాటకు భిన్నంగా తేలు కుట్టిన బాధితుల్లాగా మిగిలిపోతున్న వారి సంఖ్య భారీగానే పెరుగుతుందని తెలుస్తుంది. మండలంలో గత కొన్ని సంవత్స రాల క్రితం ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి లక్షలు కాజేసి ఆ తరువాత చేతులెత్తెయడం జరిగింది. ఇటీవల మరోమారు ఏకంగా కేంద్రంలోని రైల్వేశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షల రూపాయలు పదుల సంఖ్య యువత నుండి వసూళ్లు చేసి కాజేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే మండలానికి చెందిన ఓ మహిళ బంగారు పై ఆశతో సైబర్ నేరానికి గురై దాదాపు రూ.26లక్షలు మోసపోయినట్లు 6-9-2022న కేసు నమోదు కావడం జరిగింది. ఇందులో నైజీరియన్లు అరెస్ట్ చేయడం తెలిసిన విషయమే. మరి కొంత మంది ప్రైవేట్ చిటీలను నడుపుతూ లక్షల రూపాయలు కాజేసి ఐపీ నోటీసులు ఇచ్చిన సంఘటనలు చాలానే ఉన్నాయి. రైతుల నుండి వ్యాపారులు సైతం ధాన్యాలు, ఇతర పంటలను కొనుగోలుచేసి వాటి డబ్బులు చెల్లించకుండానే ఐపీ పెట్టిన సంఘటనలు లేకపోలేదు. ఇటీవల జిల్లాలో నూతనంగా ప్రారంభమైన ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఓ యువకుడు లక్షల రూపాయలు కాజేసి ఎలాంటి అనుమానం రాకుండా శిక్షణ పేరుతో ఆటోల్లో బేతంచెర్ల నుండి ఓర్వకల్లుకు యువకులను తరలించడం ఆ తరువాత అక్కడ కొంత మందితో శిక్షణ ఇస్తున్నట్లు క్లాసులు చెప్పించడం పకడ్బందీగా రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయడం, బయోమెట్రిక్ మిషన్ సైతం ఉపయోగించడం జరిగింది. దాదాపుగా 65మంది యువతీ, యువకుల నుండి లక్షలు కాజేసినా యువకుడితోపాటు ముఠా శిక్షణ పొందుతున్న యువతలో కొందరికి ఉద్యోగాలు వచ్చాయంటూ ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లను సృష్టించి కొన్ని నెలలపాటు వేతనాలువేసి నమ్మించినట్లు తెలుస్తుంది. తీరా చూస్తే ఉద్యోగాలకు సంబంధించి ఎలాంటి నోఫికేషన్ లేదు ఆ ఉద్యోగాలకు తమతో డబ్బులు వసూళ్ల చేసిన వారికి ఎలాంటి సంబంధంలేదని తెలుసుకుని బాధిత యువత లబోదిబోమంటూ మండలంలో బహిరంగంగానే చర్చించుకోవడం జరుగుతుంది. ఈ తంతులో ప్రభుత్వ ఉద్యోగులు సైతం భాగస్వాములుగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇలా రోజు రోజుకు ఆర్థిక నేరగాళ్ల బారిన పడే వారి సంఖ్య మండలంలో పెరిగిపోతుంది. దీని పై సంబంధిత అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు నేరస్తుల పై కఠిన చర్యలు తీసుకుని మరోమారు ఇలాంటి దుస్సాహసాలకు ఎవరు పాల్పడకుండా కట్టడి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అత్యాధునిక టెక్నాలజీతో నేరాల నియంత్రణకు కృషి చేయాలి

**పోలీసు అధికారులతో నేర సమీక్ష నిర్వహించిన....**

**శిక్షల శాతం పెంచి బాధితులకు న్యాయం జరిగేలా చేయాలి...**

కర్నూలు క్రైమ్ ఫిబ్రవరి, 01, ప్రభాతవార్తః- కర్నూలు నగరంలో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని డిఎస్పీలు సిఐలు ఎస్సైలతో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ నేర సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడుతూ నేర రహిత సమాజముగా తీర్చిదిద్దాలంటే నిందితులకు కోర్టులో శిక్షల శాతం పెంచి బాధితులకు న్యాయం జరిగేలా చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటీ నుంచి కేసు పూర్తయ్యేంత వరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు పత్రాలు సాక్షుల విచారణ వాంగ్మూలం కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీస్ అధికారులు పనితీరులో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు. నేరస్తులకు వారంట్స్ సమన్స్ సత్వరమే ఎగ్జిక్యూటివ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నేరస్తులకు కోర్టులో కఠిన శిక్షణలు పడితే బాధితులకు న్యాయవ్యవస్థ పోలీసుశాఖ పై నమ్మకం గౌరవం పెరుగుతుందన్నారు. కోర్టులో కేసులు వీగిపోకుండా శ్రద్ధ తీసుకోవాలని బలమైన వాదనలు వినిపించి బాధితులకు న్యాయం జరిగేవిధంగా చూడాలన్నారు. ప్రతి కేసులో ఖచ్చితమైన దర్యాప్తు క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. గ్రేవ్ నాన్‌గ్రేవ్ కేసుల్లో సాక్షులను మోటీవేట్ చేయాలన్నారు. సెన్సెషనల్ కేసుల్లో త్వరగా పరిశోధన పూర్తిచేసి చార్జిషిట్ దాఖలు చేయాలన్నారు. పెండింగ్ ట్రయల్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామసందర్శనలు పల్లె నిద్రలు ఫ్యాక్షన్ లా ఆర్డర్ మరియు ఇతర సమస్యలను నివారించడానికి ఇప్పటివరకు తీసుకున్న చర్యలు గురించి మరియు గుర్తించబడిన గ్రామాలలో సిసి కెమెరాల సంస్థాపన మరియు పురోగతి గురించి ఆరా తీశారు. కర్నూలు పత్తికొండ ఆదోని సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యుఐ కేసులు గ్రేవ్ కేసుల గురించి జిల్లా ఎస్పీ సమీక్షించారు. రాబోయే రోజుల్లో ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఆధునిక టెక్నాలజీ గురించి జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో పోలీసు అధికారులకు సిబ్బందికి శిక్షణ ఇప్పించి నిష్టాతులను చేస్తామన్నారు ప్రతి కేసులో దుర్యాప్తు త్వరగా చేయాలన్నారు. క్రిమినల్ కేసులు పట్టదగిన నేరాలు రోడ్డు ప్రమాదాలు కేసులు రేప్ కేసులలో దర్యాప్తులు జాగ్రత్తగా చేయాలన్నారు. నిజాయితీపని చేయాలన్నారు టెక్నాలజీని బాగా ఉపయోగించి పకడ్బంధీగా ఆధారాలు సేకరించాలన్నారు. ఈ నేర సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీఅడ్మిన్ డి ప్రసాద్ లీగల్ అడ్వైజర్‌మల్లికార్జున రావు డిఎస్పీలు వెంకటాద్రి వెక్రటామయ్య యుంగధర్ బాబు శ్రీనివాసులు వినోద్ కుమార్ కెవి మహేష్ మరియు సిఐలు ఎస్సైలు పాల్గొన్నారు.






# పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు

**- గడప గడపలో కోడుమూరు ఎమ్మెల్యే జెరదొడ్డి సుధాకర్**



గడవ గడవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్, ఎంపిపి, నాయకులు

**కర్నూలు రూరల్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** వైసిపి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని కోడుమూరు ఎమ్మెల్యే జెరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొన్నారు. ముందుగా కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, మండల ఎంపిపి డి వెంకటేశ్వరమ్మ, కర్నూలు మండల మాజీ ఉపాధ్యక్షుడు డి వాసులకు ఉల్చాల గ్రామ సర్పంచ్ విద్యాసాగర్, గ్రామస్తులు, మండల స్థాయి అధికారులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే సుధాకర్ గ్రామంలో వీధివీధిన తిరుగుతూ ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం ప్రతి కుటుంబానికి చేసిన ఆర్థిక సహాయాన్ని బుక్‌లెట్ ద్వారా ఎమ్మెల్యే స్వయంగా వివరించారు. గతంలో కన్నా వైసిపి ప్రభుత్వంలో చాలావరకు గ్రామంలో సమస్యలు పరిష్కారం అయ్యాయని గ్రామస్తుల ద్వారా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఆయన గ్రామస్తులతో కలియ తిరుగుతూ పేరుపేరునా ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ గ్రామంలో ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో ఏవైన సమస్యలున్నాయా..అని గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, ప్రభుత్వం విద్యార్థులకు అందచేస్తున్న ట్యాబులు, స్కూల్ యూనిఫాం, బ్యాగ్స్, షూస్, సాక్సులు తదితర సామాగ్రి కరెక్టుగా అందుతున్నాయా..లేదా..అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..జగనన్న గోరుముద్దలో మధ్యాహ్న భోజనం రుచికరంగా అందుతుందా ప్రభుత్వం అందచేస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా అని స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకుని కాసేపు వారితో సరదాగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ప్రసన్నకుమార్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు, ఉల్చాల గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, నాయకులు, కార్యకర్తలు, వైసిపి అభిమానులు పాల్గొన్నారు.

# సద్గురు ఆరూఢజ్యోతి శాంతాశ్రమంలో జ్ఞాన దాసోహాలు..



ఉత్స వాలకు సిద్ధమైన శ్రీ సిద్ధారుఢ విగ్రహం.

**కోసిగి, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త :** కోసిగిలోని సద్గురు ఆరూఢజ్యోతి శాంతాశ్రమంలో సప్తమ వార్షికోత్స వం సందర్భంగా జ్ఞాన దాసోహాలు, జాతర, మహాత్ముల ఆధ్యాత్మిక ప్రసంగాలు, అలాగే పరమ పూజ్య సద్గురు శ్రీ మదబినవ శివపుత్ర మహాస్వామి 67వ జయంతోత్స వంతో పాటు జ్ఞాన దాసోహ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శాంతాశ్రమం సద్భక్తులు బుధవారం తెలిపారు..ఈ నెల 3వ తేది నుండి 5వ తేది వరకు పరమ పూజ్య శ్రీ నిజానంద మహాస్వాములు ఆధ్వర్యంలో శ్రీ సిద్ధారుఢ మఠంలో సకల పూజలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఉంటాయన్నారు..ఇందులో భాగంగా 4వ తేదిన పరమపూజ్య సద్గురు శ్రీ సిద్ధారుఢ మహాస్వాముల వారికి రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, మహ మంగళ హారతి, అనంతరం ప్రణవ ధ్వజారోహన కార్యక్రమాలు ఉంటాయన్నారు..అలాగే 5వ తేదిన భగవద్గీతలోని శ్లోకంపై ప్రత్యేక ప్రసంగం, మహ మంగళహారతి ఉంటుందన్నారు..చివరి రోజు 5వ తేదిన మాఘ పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆధ్యాత్మిక ప్రసంగాలు, మధ్యాహ్నం సద్గురు శ్రీ సిద్ధారుఢ మహాస్వాముల విగ్రహ పల్లకి ఉత్స వం, సాయంత్రం మహ రథోత్స వం, మహ మంగళహారతి ఉంటుందన్నారు..ఈ మహ సంకల్ప కార్యక్రమంలో కర్ణాటకలోని బీజాపురం శ్రీ షణ్ముఖారూఢ మఠం, హుబ్బలి పీఠాధిపతి శ్రీ మదభినవ శివపుత్ర స్వామి, అలాగే ఉత్తరాధికారి శ్రీ అభినవ సిద్ధారుఢ స్వామి, శ్రీ గవిమఠ సంస్థానాధిపతి శ్రీ కరిబసవ రాజేంద్ర స్వామి, హొళ్వి చరణగిరి సంస్థాన మఠాధిపతి శ్రీ అభినవ మహంతేశ్వర స్వాములు పాల్గొని ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ప్రవచనాలు వల్లిస్తారని వివరించారు..కావున భక్తులు, గ్రామ ప్రజలు ఈ పవిత్ర కార్యక్రమ పూజలలో పాల్గొని గురువుల కృపకు పాత్రులు కావలెనని కోరారు..

# అందుబాటులో అధార్ సేవలు



అధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపిడిఓ

**బండిఆత్మకూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్తః** మండలంలోని సంతజూటూరు గ్రామ సచివాలయం నందు అధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అధార్‌సేవా కేంద్రాన్ని ఎంపిడిఓ వాసుదేవ గుప్తా, సర్పంచ్ యలగల రామచంద్రుడు, పంచాయితీ సెక్రెటరీ శేషన్నలు ప్రారంభించారు. ఈసందర ్బంగా ఎంపిడిఓ మాట్లాడుతూ అందుబాటులో వున్న అధార్ సేవలు అందరు వినియోగించుకోవాలని గతంలో అధార్ సేవల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని ఇప్పుడు ప్రభుత్వం అధార్ సేవలను సంతజూటూరు సచివాలయానికి అనుసంధానం చేసిందని చుట్టు పక్కల గ్రామ ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయంలోనే కరెంటు బిల్లులు చెలి ంచవచ్చని తెలిపారు. ఈఅధార్ సేవ కేంద్రంలో చిన్నపిల్లల పేరు నమోదు, పుట్టిన సవరణ, అధార్ చిరునామా మార్పిడి, ఫోటో మార్పిడి, కొత్త అధార్‌కార్డులు, అధార్‌కార్డుకు ఫోన్ అనుసంధానం మొదలైన అధార్ సేవలు పొందవచ్చన్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామంలో వారందరికి అధార్ గురించి ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ సెక్రెటరీ వెంకటలక్ష్మీ, విఆర్వో సుంకన్న, అధార్ సూపర్‌వైజర్ ప్రియాంక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమావేశం నందు పంచాయితీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందితో ఫెస్ అటెండింగ్ వేయించాలని, ఇంటిపన్నులు వందశాతం పూర్తిగా వసూలు చేయాలని మొదలగు అంశాలపై ఎంపిడిఓ తెలిపారు. ఈకార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయితీ సెక్రెటరీలు పాల్గొనా ్నరు.